FOR ADS......
ఆకాంక్ష
CONTACT:
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష TGTEL/25/A1964 akankshanews.com తెలుగు సంచలన దిన పత్రిక

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :191 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 03 - మార్చి - 2026

## సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై డ్రోన్ దాడి..

### చమురు ఉత్పత్తిపై ఎఫెక్ట్

- అరామ్‌కో రిఫైనరీపై దాడి: సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాలలో ఒకటైన 'రాస్ తనురా'లోని అరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసింది.
- మంటలు మరియు మూసివేత: ఈ దాడి కారణంగా రిఫైనరీలో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో ఆ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చినట్లు సమాచారం.
- చమురు ధరల పెరుగుదల: ఇప్పటికే యుద్ధ ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర 10 శాతం పెరిగి, బ్యారెల్ 80 డాలర్లకు పైగా చేరుకుంది. తాజా దాడితో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. మిగతా..2లో



## కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడి..!



- ఇరాన్ దాడులు: తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ భారీ దాడులకు దిగింది.
- అమెరికా ఎంబసీపై దాడి: కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్లు సమాచారం. అక్కడ భారీగా పొగలు అలుముకోవడంతో అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి దిగాయి.
- పలు నగరాల్లో పేలుళ్లు: దుబాయ్, దోహా, అబుదాబి, మనామా (బహ్రెయిన్) నగరాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.
- సైప్రస్‌లో ఉద్రిక్తత: సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై కూడా డ్రోన్ దాడి జరిగింది, అయితే దీనివల్ల స్వల్ప నష్టమే వాటిల్లిందని అక్కడి ప్రభుత్వం తెలిపింది.
- ఇరాక్ స్పందన: ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలోకి వచ్చిన రెండు డ్రోన్లను ఆ దేశ రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి.

## కళాశాల బస్సును ఢీ కొట్టిన బైక్.. ముగ్గురు యువకుల మృతి




ఏలూరు: ఏలూరులోని డీపాల్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి.. కళాశాల బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మిగతా..2లో

## సమర్థ పాలన కోసం అన్ని శాఖల్లో



**అమరావతి, మార్చి 02 (సదా మీకోసం) :** అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత పెంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్, ప్రజల సానుకూల స్పందనపై సోమవారం నిర్వహించిన సమీక్షలో డ్రోన్, సీసీ టీవీ కెమెరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసే మెకానిజం తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుళ్లు నివారించేందుకు తమిళనాడులోని శివకాశీలో రక్షణ చర్యలపై అధ్యయనం చేయాలని తెలిపారు.

పేజి 2లో ▶

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ఆర్టీజీఎస్, ప్రజల స్పందనపై ముఖ్యమంత్రి సమీక్ష
- డ్రోన్, సీసీ టీవీ, శాటిలైట్ డేటా సమీకృతం
- పనితీరు మెరుగుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరం
- శివకాశీలో రక్షణ చర్యలపై అధ్యయనం చేయాలి
- బస్టేషన్లలో తాగునీటి సౌకర్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు ఉండకూడదు
వాట్సప్ మనమిత్ర సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



## మా అబ్బాయి వివాహానికి రండి



హైదరాబాద్‌లో ఈ నెల 5న జరిగే తమ కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు ఆహ్వానించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. మిగతా..2లో

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు: ఏపీ మంత్రి శ్రీనివాస్



అమరావతి: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగువారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని ఏపీ ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పేజి 2లో ▶

## హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు: బండి సంజయ్



కామారెడ్డి: హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు.

## అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ పీఏసీ సమావేశం.. పాల్గొన్న రాహుల్‌గాంధీ



వికారాబాద్: వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం ప్రారంభమైంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

పేజి 2లో ▶

## ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులకు గడువు పొడిగింపు




అమరావతి: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈఏపీసెట్ దరఖాస్తుల సమర్పణకు గడువు తేదీని పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ఎన్.మోహన్‌రావు వెల్లడించారు. ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో మార్చి 17 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ.వెయ్యితో మార్చి 21, రూ.2వేలతో మార్చి 25, రూ.4వేలతో మార్చి 30, రూ.10వేలతో ఏప్రిల్ 3 వరకు అవకాశం కల్పించారు. పేజి 2లో ▶

## సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక సీఎస్‌గా విజయానంద్ బాధ్యతల స్వీకరణ

- కొత్త బాధ్యతలు: ఫిబ్రవరి 28న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రిటైర్ అయిన విజయానంద్‌ను, ప్రభుత్వం సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది.
- బాధ్యతల స్వీకరణ: అమరావతి సచివాలయంలోని మొదటి అంతస్తులో ఆయన ఈరోజు (మార్చి 2) బాధ్యతలు చేపట్టారు.



## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యం



రొళ్ల: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యమైన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొళ్ల మండలం హెచ్.టి హళ్లి వద్రహట్టి గ్రామానికి చెందిన వీరేశ్ తాపీ మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి సుబ్బమ్మ, భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు రోహిణి, రచనతో కలిసి నివాసముంటున్నాడు.
మద్యానికి బానిసైన వీరేశ్.. భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 27న ఇంట్లో మరోసారి గొడవ జరిగింది. పేజి 2లో ▶

# ఇథనాల్ 20 : ప్రజల జీవితాలతో చెలగాటమాడే పథకం

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో రెండు ఇథనాల్ పరిశ్రమలు స్థాపించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పరిశ్రమ వస్తే సదరు స్థానిక ప్రజలకు క్యాన్సర్, శ్వాసకోశ చర్మవ్యాధులు, చిన్నపిల్లలకు, గర్భిణులకు ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. కిసాన్ సెజ్‌లో ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు అనుమతులు లేవని, ఈ పరిశ్రమ వలన నీరు కలుషితం అవుతుందని, పర్యావరణం పూర్తిగా దెబ్బ తింటుందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. నీటి వినియోగం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 30వ తేదీన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. 'మాకు పరిశ్రమలు కావాలి కానీ...కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు మాత్రం వద్దు' అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు మద్దతుగా నిలబడటానికి వచ్చిన వామపక్ష పార్టీల నాయకులను పోలీసులు నిర్బంధించారు. ఈ పరిశ్రమను వ్యతిరేకిస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కిసాన్ సెజ్‌లో నిర్మించే రాంషీ బయో ప్రైవేట్ లిమిటెడ్ 370 కిలోలీటర్లు, గాయత్రీ రివ్యూస్ అండ్ అలైడ్ ఇండిస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ 200 కిలోలీటర్ల ఇథనాల్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కిసాన్ సెజ్ పేరిట దాదాపు 27 ఏళ్ల క్రితం 2,776 ఎకరాల భూమిని సేకరించారు. ఎరువుల ఫ్యాక్టరీ, వ్యవసాయ పరిశ్రమల పేరుతో రైతుల నుంచి సేకరించి ఆ భూమిలో ఇంతకాలం ఏ పరిశ్రమ పెట్టకుండా చివరికి ప్రాణాలతో చెలగాటమాడే పరిశ్రమలు పెట్టడం పట్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిశ్రమ వలన తమ జీవనానికి, గ్రామాలకు, భూములకు తీవ్ర నష్టం జరుగుతుందని, కాలుష్య కారక పరిశ్రమలు పెట్టవద్దని ప్రజలు గట్టిగా కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు వర్గీకరణలోనే ప్రమాదకరమైన అంశాలు ఉన్నా, 'క్యాటగిరి ఏ' బదులు తక్కువ ప్రమాదాలున్న 'క్యాటగిరి బీ'గా చూపటంలోనే పాలకుల కార్పొరేట్ అనుకూల వైఖరి బట్టబయలవుతుంది. అసలు కిసాన్ సెజ్‌లో ప్రమాదకరమైన రసాయనాలను వెదజల్లే పరిశ్రమలకు అనుమతులు లేకపోయినప్పటికీ అనుమతులు ఇవ్వడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. చట్టబద్ధంగా చెల్లని టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఆధారంగా తయారైన లోపభూయిష్టమైన పర్యావరణ ప్రభావ నివేదికలతో (ఇఐఏ) ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించటం ప్రజల హక్కులను హరించటం కిందకు వస్తుంది. వాయు కాలుష్యంపై సరైన అంచనాలు లేవు. ప్రధానంగా నీటిపై ఆధారపడే రెండు పెద్ద పరిశ్రమలను ఒకే ప్రాంతాల్లో నిర్మించటం ద్వారా ఏర్పడే నీటి కొరత గురించి పేర్కొనలేదు. ప్రమాదాల ప్రభావాన్ని, ఏరియా విస్తృతిని తగ్గించి చూపించారు. ఈ పరిశ్రమల వలన స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు వస్తాయనే స్పష్టత కూడా లేదు. మొత్తం ప్రక్రియలో ప్రజల భద్రత, నీటి వనరుల, పర్యావరణ పరిరక్షణ కంటే కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలే ముఖ్యంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తున్నామనే పేరుతో ప్రజలను మరింత సమస్యల ఊబిలోకి నెట్టటమే అవుతుంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో శ్రీహనుమాన్ బయో ఫ్యూయల్స్ సంస్థ పేరుతో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయమని 2024 జులై 12న ఎ.పి కాలుష్య నియంత్రణ మండలికి ఈ ప్రాంత రైతులు తమ అభ్యంతరాలను తెలియజేసినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుగానే ఉంది. దీని గురించి గ్రామస్తులకు ఎటువంటి సమాచారం లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టటం పట్ల ఈ ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ముఖ్యంగా ఈ ప్లాంట్ వలన సాగునీటికి తీవ్రమైన కొరత ఏర్పడుతుందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా ఉంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2021లో 'ఇథనాల్ 20' అనే కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. ఈ విధానం ప్రకారం ఏప్రిల్ 1వ తేదీ నుంచి దేశంలో వాడుతున్న పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలి. ఈ నిర్ణయం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. ఈ నిర్ణయాన్ని అదునుగా తీసుకొని బడా కార్పొరేట్ శక్తులు ఇథనాల్ పరిశ్రమలు పెట్టటానికి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించాయి. ముందు కెసిఆర్ పాలనలో ఉన్న తెలంగాణలో 30 ప్రాంతాలలో అనుమతులు సంపాదించారు. 2024 అక్టోబర్‌లో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఆ ప్రాంత రైతులు, ప్రజాస్వామ్యవాదులతో ఏర్పాటైన పోరాట కమిటీ నాయకత్వాన రోజుల తరబడి నిరవధిక నిరాహార దీక్షలు చేశారు. అంతేకాక, జాతీయ రహదారిని దిగ్బంధనం చేయడంతో చివరికి జిల్లా కలెక్టర్ వచ్చి ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఆపివేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. రాజస్థాన్‌లో కూడా ఇదే తరహా ఉద్యమాలు సాగాయి. అలానే నారాయణపేట జిల్లా చిత్తనూరు గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ ఫ్యాక్టరీని రద్దు చేస్తామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈనాటికీ రద్దు చేయకుండా నాటకాలు ఆడుతున్నది. మన రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇథనాల్ పరిశ్రమలు పెట్టటానికి కార్పొరేట్ శక్తులకు గ్రీన్ సిగల్ ఇచ్చింది. ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లా రాచర్లపాడు ప్రాంతం రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. ఇక్కడ పెడుతున్న రెండు ప్లాంట్లకు అనుమతులు ఇవ్వవద్దని రైతాంగం చేస్తున్న ఆందోళనలను చంద్రబాబు ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. పెరుగుతున్న ఇంధన వనరుల కొరతను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఒకవైపు... సోలార్ విద్యుత్తును సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ఇంధన పొదుపులో భాగంగా ఎప్పటి నుంచో ఎలక్ట్రిక్ రైళ్లను నడుపుతూ, ఇప్పుడు అన్ని స్థాయిలలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నది. మరోవైపు పెట్రోలులో కలిపే ఇథనాల్ కోసం 'ఇథనాల్ 20' పేరుతో ప్లాంట్లకు పర్మిట్లు ఇవ్వటమంటే ఏమిటి? బడా కార్పొరేట్ శక్తులకు వరాలు ఇచ్చి రైతుల జీవితాలతో చెలగాటం ఆడటమే కదా! మొత్తంగా ఈ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ విధ్వంసంతోపాటు నీటి కొరత, ఆహార ధాన్యాల కొరతను సృష్టించడమే అవుతుంది! ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర పాలకులు కళ్ళు తెరిచి ప్రజల జీవితాలతో చెలగాటమాడే ఈ పరిశ్రమలకు స్వస్తి పలికేంత వరకు తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలలో సాగిన పోరాటాల స్ఫూర్తితో రైతాంగం సంఘటితంగా ముందడుగు వేయాలి.

# ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

మొదటిపేజీ తరువాయి
దరఖాస్తుల తప్పుల సవరణకు ఏప్రిల్ 4-6 వరకు అవకాశం కల్పించారు.
పరీక్షల నిర్వహణ తేదీల్లో ఎలాంటి మార్పులు ఉండబోవు. ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి 15 వరకు, 18న నిర్వహిస్తారు. వ్యవసాయ, ఫార్మసీ పరీక్షలు మే 19, 20 తేదీల్లో ఉంటాయి. ప్రాథమిక 'కీ' మే 23న విడుదల చేసి, 25 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఫలితాలు జూన్ 1న ప్రకటిస్తారు.

# సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక సీఎస్‌గా విజయానంద్ బాధ్యతల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి
అమరావతి: సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 28న సీఎస్‌గా ఆయన పదవీ విరమణ చేయగా ప్రభుత్వం ఆయన్ను ముఖ్యమంత్రి ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ నేపథ్యంలో సచివాలయంలోని మొదటి అంతస్తులో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, తితిదే వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, సచివాలయ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అదృశ్యం

మొదటిపేజీ తరువాయి
అదేరోజు రాత్రి ఇంటి నుంచి సుబ్బమ్మ, లక్ష్మి, రోహిణి, రచన బయటకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి బంధువులు వెతుకుతున్నా వారి ఆచూకీ లభించలేదు. దీంతో మార్చి 1న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై గౌతమి తెలిపారు. వీరేశ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

# ఎగువ అహోబిలంలో ఘనంగా రథోత్సవం

ద



ఆళ్లగడ్డ గ్రామీణం: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా జ్వాలా నరసింహస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువు తీర్చారు. అర్చకులు రథం వద్ద సంప్రదాయబద్ధంగా పూజలు చేసి శుభ ముహూర్తంలో రథాన్ని ముందుకు కదిలించారు. ఆలయ తిరువీధులో స్వామి రథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామ స్మరణలతో తిరువీధుల్లో మారుమోగింది. దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామి కళింగ నర్తనోత్సవ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి రంగనాథ యతేంద్ర మహాదేశికన్ స్వామివారిని ప్రత్యేకంగా ఆరాధించారు.

# సౌదీ, బహ్రెయిన్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్



దిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా మహ్మద్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు దేశాలపై దాడులను ఖండించారు. ఇరు దేశాల్లో భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఇజ్రాయెల్, అమెరికా జరిపిన సంయుక్త దాడిలో ఇరాన్ చీఫ్ ఆయతుల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతిదాడులకు పాల్పడుతోంది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి.

# అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ పీఏసీ సమావేశం.. పాల్గొన్న రాహుల్‌గాంధీ

మొదటిపేజీ తరువాయి
క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. నేడు జరిగే ముగింపు సమావేశంలో రాహుల్ పాల్గొని డీసీసీ అధ్యక్షులు, నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

# కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడి..!

మొదటిపేజీ తరువాయి
ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ దాడులు చేపట్టింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పొగ దట్టంగా అలముకుంది. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకున్నట్లు పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి.

**దుబాయ్, దోహాల్లో పేలుళ్లు..**

మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టమే జరిగిందని సైప్రస్ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగుతోంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి.

**అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్**

ఈసందర్భంగా యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తోన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. యుద్ధం విషయంలో అమెరికా (ఖూూ)తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టంచేశారు. "ఈ దాడులను మేం మొదలుపెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు" అని అలీ లరిజానీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై

మొదటిపేజీ తరువాయి
ఇరాన్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీపై ఇరాన్ షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు.

ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి లో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లు దాటింది. ఇప్పుడు తాజా దాడులతో ఈ ధర మరింత పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. ఈ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ దాడి జరగ్గా.. దుబాయ్, దోహా, అబుదాబి, జెరూసలెంలోనూ ఈ ఉదయం పేలుడు శబ్దాలు వినిపించాయి.

# సమర్థ పాలన కోసం అన్ని శాఖల్లో

మొదటిపేజీ తరువాయి
వేసవి దృష్ట్యా ఆర్టీసీ బస్టేషన్లలో ప్రయాణికులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలని పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు లేకుండా స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదనపు సమాచారం కోసం తప్ప, ఒకే రకమైన వివరాల కోసం ప్రజలను, సిబ్బందిని సర్వేలతో ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు. రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను 953కి పెంచినట్లు అధికారులు వివరించగా, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు.

## గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు: ఏపీ మంత్రి శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి
ఆయా దేశాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశంపై సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్) కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ 24/7 హెల్‌లైన్ 0863-2340678, వాట్సాప్ o91 85000 27678 నంబర్లకు తెలియజేయవచ్చని, ఈమెయిల్: ష్రవశ్రీజూశ్రీఅఅవఘజూఅతీం.ఇశీఎ ద్వారా సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

# శబరిమల అంశం: అఫిడవిట్ దాఖలు చేయనున్న ట్రావెన్‌కోర్ బోర్డు



కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ గతంలో సుప్రీంకోర్టు(రాబజూతీవఎవ జశీబతీ) తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పును తిరిగి సమీక్షించాలని పలు రివ్యూపిటిషన్లు దాఖలయ్యాయి. అయితే ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డ్ (టీడీబీ) మాత్రం మొదటి నుంచీ మహిళల ప్రవేశాన్ని (10 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు) వ్యతిరేకిస్తూ వస్తోంది. పాత సంప్రదాయాన్నే కొనసాగించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేస్తామని టీడీబీ(ుణదీ) అధ్యక్షుడు కె.జయకుమార్ వెల్లడించారు.దీనిపై ఆయన విలేకరులతో మాట్లాడారు. "శబరిమల ఆలయ సంప్రదాయాలు, పరిరక్షణ కోసమే ట్రావెన్‌కోర్ బోర్డు ఏర్పాటైంది. మహిళల ప్రవేశం విషయంలో ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించాలని బోర్డు సమావేశంలో నిర్ణయించాం. ఇందులో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. ఆలయ సంరక్షణే టీడీబీ లక్ష్యం. అందుకే అఫిడవిట్‌ను దాఖలు చేయాలని టీడీబీ నిర్ణయించింది" అని కె.జయకుమార్ తెలిపారు. మార్చి 14లోగా అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. కార్నీ పర్యటన వేళ.. భారత్-కెనడా మధ్య యురేనియం డీల్‌సుప్రీంకోర్టు 2018లో శబరిమలకు అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతినిచ్చింది. అప్పటి నుంచి ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఇవన్నీ సుప్రీం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సహా ఆయా వ్యాజ్యదారులు మార్చి 14లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సంపాదకీయం

## సంఘటిత పోరాటాన్ని తప్పనిసరి చేస్తున్న లేబర్ కోడ్లు!

మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికులకు మేలు చేస్తుంటే కమ్యూనిస్టులు కార్మికులను రెచ్చగొడుతున్నారని కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఈ లేబర్ కోడ్‌లలోని కార్మిక వ్యతిరేక అంశాలను కమ్యూనిస్టులు మాత్రమే వ్యతిరేకించటం లేదు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ, తదితర సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్ కార్మిక విభాగం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా ఈ కోడ్లలో రెండింటిని, "కార్మికులకు వ్యతిరేకమూ, యాజమాన్యాలకు అనుకూలమూ" అని వ్యతిరేకించింది. వీటిలో "యూనియన్లను మొత్తంగా తుడిచిపెట్టే అంశాలు వున్నాయి" అని 2025 ఫిబ్రవరి 12న తీర్మానించింది. వలస పాలన కాలం నాటి కార్మిక చట్టాలను మార్చామని బీజేపీ పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కానీ కొత్త లేబర్ కోడ్లలో కూడా తేడా ఏమీ లేదు. పైగా కార్మికుల ట్రేడ్ -యూనియన్ హక్కుకు, సమ్మె హక్కుకు మరిన్ని సంకెళ్ళు వేసారు. యాజమాన్యాలపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత బలహీనం చేసారు. గతంలో కొన్ని షెడ్యూల్ పరిశ్రమల్లో మాత్రమే వర్తించే 'కనీస వేతనాలను' ఇప్పుడు కార్మికులందరికీ వర్తింపచేసాం అని కేంద్ర ప్రభుత్వం గొప్పలు పోతోంది. నిజమే. అయితే ప్రస్తుత చట్టం ప్రకారం కూడా కనీస వేతనాలను అనేక యాజమాన్యాలు అమలుచేయటం లేదు. అమలుకు ప్రభుత్వాలూ సరైన చర్యలు తీసుకోవటం లేదు. ఈ కనీస వేతనాల్లో మూలవేతనాన్ని ప్రభుత్వం కనీసం అయిదేళ్లకు ఒకసారి పెంచాలి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పరిశ్రమల్లో 2007, మరికొన్ని పరిశ్రమల్లో 2011 తరువాత నేటికీ వీటిని ప్రభుత్వాలు సవరించలేదు. ఇక ఈ కనీస వేతనాలు నిర్ణయించడానికి సంబంధించి అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు ఈ రోజు ఉద్యోగంలో చేరినవారికీ, రేపు రిటైర్ అయ్యేవారికీ ఒకటే కనీస వేతనం! ఇటువంటి అనేక సమస్యలకు కొత్త లేబర్ కోడ్‌లలో కూడా ఎలాంటి పరిష్కారమూ లేదు. ఇక గిగ్, ప్లాట్‌ఫాం తదితర అసంఘటితరంగ కార్మికులకు కొత్త కోడ్‌లలో కల్పించామన్న 'సామాజిక భద్రత' సంగతి కూడా ఇంతే. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చట్టాలు ఇప్పటికే లక్షలాది కార్మికులకు అమలు కావటం లేదు. వీటిలోని వివిధ సీలింగులను కొనసాగించడంవల్ల అవి చాలా శాతం కార్మికులకు వర్తించవు. ఇక ఈ 'సామాజిక భద్రత' గతి ఎలా వుంటుందో ఊహించవచ్చు. ఒక సంవత్సరం పని చేస్తే గ్రాట్యుటీ చెల్లించే విధంగా చట్టాన్ని మార్చామని అంటున్నారు. ఇది కార్మికులందరికీ వర్తించదు. కేవలం 'ఫిక్స్‌డ్ టర్మ్' కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ గ్రాట్యుటీ చక్కెరపూతతో 'ఫిక్స్‌డ్ టర్మ్' చేదుమాత్రను మింగిస్తున్నారు. నిజానికి చాలా కాలంగానే అనేక యాజమాన్యాలు ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీఎస్ఆర్టీసీలో కూడా దీన్ని అమలు చేసారు. ఇప్పుడు ఈ పద్ధతికి మరింత గట్టి చట్టబద్ధతను కల్పించారు. కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రతా లేకుండా చేసే మార్పు ఇది. కొత్త కోడ్‌లలో 'కోర్' (కీలక) విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల నియామకాన్ని నిషేధించామని అంటున్నారు. ఈ 'కోర్' విభాగాలేమిటో చట్టంలో చెప్పలేదు. వీటిని మళ్ళీ ఆయా ప్రభుత్వాలు నిర్ణయించాలి. కాగా, సంవత్సరమంతా కొనసాగే లోడింగ్, అన్‌లోడింగ్, శానిటేషన్ వగైరా ముఖ్య విభాగాలు 'కోర్' విభాగాలు కాదని లేబర్ కోడ్‌లలో ప్రకటించేసి, ఆ పనుల్లో కాంట్రాక్టు కార్మిక విధానాన్ని చట్టబద్ధం చేసేసారు. వందమందికి పైగా ఉన్న పరిశ్రమలను మూత పెట్టడానికి పాతచట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలి. ఈ సంఖ్యను 300 చేసారు. దీంతో అత్యధిక శాతం పరిశ్రమల్లో కార్మికులు దీని పరిధిలోకి రారు. యాజమాన్యం పరిశ్రమ మూసివేతకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల తర్వాత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఇచ్చినట్లే భావించాలని అదే చట్టంలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా వేలాది పరిశ్రమలు మూతపెట్టబడి, చట్టం ప్రకారం పరిహారం దక్కక, దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరిగే కార్మికుల కథలకు కొదవలేదు. పరిహారం ఇవ్వకుండా కార్మికులను తొలగించడానికి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలతో సహా అనేక యాజమాన్యాలు కార్మికులనే రాజీనామాలు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నాయి. బ్యాంకు బకాయిలు తీర్చలేక దివాలా తీసిన పరిశ్రమల్లో కార్మికుల బకాయిల వసూలు అసాధ్యం అయ్యేలా కొత్త దివాలా చట్టాలు, నిబంధనలు తెచ్చారు. పాత, కొత్త కార్మిక చట్టాల్లో కార్మికుల హక్కుల గురించిన వాస్తవ పరిస్థితికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కారణంగానే కార్మిక సంఘాలు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడవలసివస్తోంది. ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన న్యాయమైన వేతనం, భద్రతగల పనిపరిస్థితులు, న్యాయబద్ధమైన సర్వీసు రూల్స్, రిటైర్మెంట్ తర్వాత తగిన కనీస పెన్షన్ వగైరాలు వేటినీ చట్టాలు, నిబంధనలు లోగడ గ్యారంటీ చేయలేదు; రేపూ చేయలేవు. కార్మికుల, ప్రజల ప్రయోజనాలు మాత్రమే లక్ష్యంగా పనిచేసే నిజమైన ప్రజాస్వామిక రాజకీయవ్యవస్థ మాత్రమే వాటిని గ్యారంటీ చేయగలుగుతుంది. అటువంటి వ్యవస్థకోసం రైతాంగం, గ్రామీణ పేదలు, తదితర కోట్లాది శ్రమజీవులతో భుజం భుజం కలిపి పోరాడటం తప్ప కార్మికవర్గానికి మరో ప్రత్యామ్నాయం లేదు.

## భయమా... విశ్వాసరాహిత్యమా?




కశ్మీర్ యువతలో అపారమైన ప్రతిభ, మేధ, సృజనాత్మకత ఉన్నాయి. అదే సమయంలో, లోయను దాటి బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టాలన్న ఆలోచనను ఏదో తెలియని భయం ఆపేస్తోంది. అది వ్యక్తిగతమా, సామాజికమా, సాంస్కృతికమా? ఒక తరం మనసుల్లో సుడులు తిరుగుతున్న నిశ్శబ్ద సంభాషణను వినే ప్రయత్నం జరగాల్సి ఉంది. కశ్మీర్ యువతకు 'బయటి ప్రదేశం' అనేది కేవలం భౌగోళిక సంబంధమైన అంశం కాదు. అది ఒక అపరిచిత ప్రపంచం. అక్కడ భాష విభిన్నం, సంస్కృతి వేరుగా ఉంటుంది, స్పందనలు ఊహించలేనివిగా ఉంటాయి అన్న భావన వారిలో బలంగా నాటుకుపోయింది. లోయ బయట మనల్ని ఎలా చూస్తారు? మన మాటల్ని, మన మౌనాన్ని ఎలా అర్థం చేసుకుంటారు? అనే సంశయం అంతిమంగా 'ఇక్కడ ఉంటేనే సురక్షితం' అన్న భావనగా మారి, ఒక రక్షణాత్మక ధోరణిగా స్థిరపడుతోంది. వాస్తవానికి ఇది సౌకర్యం కాదు, కాలక్రమంలో గట్టిపడిన మానసిక స్థితి. ఈ భయం ఒక కారణం వల్ల పుట్టింది కాదు. ఒక సంఘటన ఫలితం కాదు. కాలం, పరిస్థితులు, మాటలు, మౌనంతో పెరిగిన భావన అది. సాంస్కృతికంగానూ ఈ భయం లోతుగా ఉంది. కశ్మీర్ సంస్కృతి ఒక ప్రత్యేక లయలో నడుస్తుంది. దాన్ని విడిచి బయటికి వెళ్లడం అంటే, తన సొంత గుర్తింపును తాత్కాలికంగా పక్కనపెట్టాల్సి రావడమనే ఆలోచన ఇక్కడి వారిని వేధిస్తోంది. అలాగే, కొత్త ఆహారం తినడం, కొత్త మాటలు నేర్చుకోవడం కన్నా 'బయట నేను నెగ్గుకురాగలనా?' అన్న సందేహం కొందరిని ఎక్కువగా బాధిస్తుంది. అందుకే కశ్మీర్ యువతలో చాలామందికి బయటి ప్రపంచం పెద్ద పరీక్షలా కనిపిస్తుంది.

### అందరిలాగే వారూ...

కొన్ని భయాలు వ్యక్తిగత అనుభవాల నుంచి పుట్టవు. ఎవరికో ఎదురైన సంఘటన, ఇంకొకరి హెచ్చరిక, వేరెవరిదో మౌనం.. ఇవన్నీ కలిసి ఒక ఊహాత్మక ప్రపంచాన్ని నిర్మిస్తాయి. రాజకీయ కోణం గురించి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు. అది యువత మనసుల్లో లేకపోయినా, నేపథ్యంగా ఉంటుంది. ఒకవైపు టెక్నాలజీ ప్రపంచాన్ని దగ్గర చేస్తోంది. దాని సాయంతో లోయలో కూర్చునే యువత ప్రపంచంలోని ఏ విశ్వవిద్యాలయం గురించి అయినా తెలుసుకోగలుగుతుంది. అవసరమైన సమాచారం పొందుతుంది. మరోవైపు, అదే టెక్నాలజీ భయాలనూ వేగంగా పెంచుతుంది. ఒక్క వీడియో లేదా పోస్టు చాలు బయటి ప్రపంచం ప్రమాదకరం అన్న భావనను బలపరచడానికి! సామాజిక మాధ్యమాల ఉద్ధృతిలో నిజం, అతిశయోక్తి మధ్య తేడా క్రమంగా మసకబారుతోంది. ఇక్కడే ఒక తాత్విక ప్రశ్న ఉద్భవిస్తుంది. భయం అంటే ఏమిటి? అది ప్రమాదానికి స్పందనా? లేదంటే అపరిచిత పరిస్థితులకు ఇచ్చే పేరు మాత్రమేనా? కశ్మీర్ యువతలో కనిపించే భయం చాలాసార్లు రెండో దానికి దగ్గరగా ఉంటుంది. వారి ప్రపంచాన్ని అదే పరిమితం చేస్తోంది. 'భయపడొద్దు, బయటికి వెళ్లండి' అని చెప్పడం సులభం. కానీ జీవితం సలహాలతో కాదు, అనుభవాలతో మారుతుంది. అందుకే ఈ భయానికి పరిష్కారం కూడా ఉపదేశంలో కాదు, సామాజిక పరిస్థితుల్లో ఉంది. కశ్మీర్ యువతకు బయటి ప్రపంచం పరాయిదిగా కాకుండా, అవకాశాల గనిలా కనిపించాలి. విధానాల స్థాయిలో ఆలోచిస్తే, మొదట వారికి చేరువకావాల్సింది భద్రతా భావం. ఇది భౌతిక భద్రత మాత్రమే కాదు, సామాజిక భద్రత కూడా. లోయ బయట చదువుకునే, పనిచేసే కశ్మీర్ యువతకు, 'మీరు ఒంటరిగా లేరు' అన్న నిశ్శబ్ద భరోసా ఉండాలి. ఇది భారీ ప్రకటనల ద్వారా కాకుండా, స్థిరమైన వ్యవస్థల ద్వారా సాధ్యమవుతుంది. అంటే మెంటార్షిప్ వ్యవస్థలు, విద్య సంబంధ విషయాల్లో స్నేహపూర్వక మద్దతు, సాంస్కృతిక పరిచయ కార్యక్రమాలు లాంటివి అందుకు తోడ్పడతాయి. అదే సమయంలో, సాధారణ ప్రజల వ్యవహార శైలీ ముఖ్యమే. కశ్మీర్ యువత బయటి ప్రపంచంలోకి వచ్చినప్పుడు వారిని ఒక ప్రతీకలా చూడటం ఆపాలి. అందరిలాగే వారు విద్యార్థులు, ఉద్యోగార్థులు, సహచరులు అన్నట్లుగా మెలగాలి. ప్రత్యేకంగా చూడటమూ ఒక రకమైన దూరాన్ని పెంచుతుంది. అలాగే, కశ్మీర్ బయటికి వెళ్లినవారి అనుభవాలు, విజయ గాథలు తిరిగి లోయకు చేరాలి. అవి అతిశయోక్తులతో కాకుండా, భరోసాను కల్పిస్తూనే వాస్తవాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. 'అంతా చాలా తేలిక' అనే మాటకన్నా, 'మొదట్లో కాస్త కష్టంగా అనిపించినా, మెల్లగా సాధ్యమైంది' లాంటి మాటలు ఎక్కువ ధైర్యాన్నిస్తాయి. భయాన్ని అణచాలంటే, దాన్ని పూర్తిగా ఖండించాల్సిన అవసరం లేదు. అర్థం చేసుకుంటే చాలు!

### మానవీయ ప్రయాణం కావాలి

కశ్మీర్ యువత ఇప్పుడు ఒక మలుపు దగ్గర నిలబడి ఉంది. చిరపరిచితమైన లోయ ఒకవైపు, అపరిచితమైన ప్రపంచం మరోవైపు. ఈ రెండు దారుల్లో ఏదైనా ఎంచుకోవడం తప్పు కాదు. కానీ, భయం వల్ల కాకుండా స్పష్టతతో జరిగితేనే అది నిజమైన, సరైన ఎంపిక అవుతుంది. వాస్తవానికి, ఒక తరం మనసుల్లో నిశ్శబ్ద భయం ఉంది. అదే సమయంలో ఒక ఆశా ఉంది. ఆ ఆశకు కొంచెం స్థలం, సమయం, విశ్వాసం దొరికితే లోయ బయట అడుగుపెట్టడం ఒక భీతావహ ప్రయాణంలా కాకుండా, ఒక సహజమైన విషయంలా మారుతుంది. భయాన్ని పోగొట్టుకోవాలన్న ఆతృత కంటే, దాన్ని దాటి ముందుకు సాగగల విశ్వాసాన్ని పెంచుకోవడం అత్యంత కీలకం. ఎందుకంటే భయం ఒక శత్రువు కాదు. అది ఒక భావన. దాన్ని అర్థం చేసుకుని, తమలో దాగి ఉన్న సామర్థ్యాన్ని గుర్తించినప్పుడే కశ్మీర్ యువత నిజంగా లోయను దాటి, ప్రపంచంతో కలిసే అవకాశం పొందుతుంది. అయితే, అది ఒక రాజకీయ ప్రాజెక్టులా మారకూడదు. ఒక మానవీయ ప్రయాణంలా మాత్రమే సాగాలి.

## ప్రగతి పథంలో 'బుల్లెట్' వేగం!



ముంబయి-అహ్మదాబాద్ ప్రాజెక్టు పూర్తయ్యి ఇండియాలో తొలి బుల్లెట్ రైలు ఎప్పుడు పరుగులు తీస్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం తాజా బడ్జెట్‌లో ఏకంగా ఏడు హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రకటించింది. వాటిలో మూడు హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభం కానున్నాయి. అందులో రెండింటితో పాటు మరోటి కలిపి మొత్తం మూడు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లనున్నాయి. ఆయా ప్రాంతాల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు ఊతమవుతాయి. రైలు ప్రయాణం అనగానే సుదీర్ఘ సమయం, తీవ్ర అలసట అనే భావన ప్రజల్లో నెలకొంది. బుల్లెట్ రైళు ఆ దృక్పథాన్నే మార్చేయనున్నాయి. హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు రైళ్లలో, రోడ్డుమార్గంలో వెళ్లాలంటే ప్రస్తుతం ఎనిమిది నుంచి 12గంటల సమయం పడుతుంది. బుల్లెట్ రైల్లో ఆ సమయం రెండు మూడు గంటలకు తగ్గిపోతుంది. ఆయా నగరాలకు విమానంలో వెళ్లినా గంటన్నర సమయం పడుతుంది. చెకిన్ కోసం ముందుగానే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి. ఈ సమయమంతా లెక్కిస్తే విమానం కంటే బుల్లెట్ రైల్లోనే త్వరగా ఇతర నగరాలకు చేరుకోవచ్చు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి గంటా కీలకమే. బుల్లెట్ రైళ్లతో ప్రయాణ సమయం తగ్గి వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగ కార్యకలాపాలు కొత్త వేగం సంతరించుకుంటాయి. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ఏపీ రాజధాని అమరావతి మీదుగా వెళ్తుంది. హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు రాయలసీమ మీదుగా సాగిపోతుంది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి అవకాశం లభిస్తుంది. హైస్పీడ్ రైల్ కారిడార్లను పిల్లర్లపై నిర్మిస్తారు. దానివల్ల పట్టాలపైకి వాహనాలు, మనుషులు, జంతువులు వచ్చి ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండదు.

### జాతీయ అభివృద్ధి వ్యూహం

జపాన్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో హైస్పీడ్ రైల్ వ్యవస్థలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటివీ పరిమిత స్థాయిలో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను ప్రారంభించాయి. ఆసియాలో జపాన్, చైనా తరవాత దక్షిణ కొరియా బుల్లెట్ రైళ్ల ద్వారా తన రవాణా రంగాన్ని పూర్తిగా మార్చుకుంది. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల అభివృద్ధిలో హైస్పీడ్ రైళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలోనే మొట్టమొదటి బుల్లెట్ రైలు జపాన్‌లోని టోక్యో-ఒసాకా మధ్య 1964లో ప్రారంభమైంది. అప్పటి దాకా టోక్యో కేంద్రంగా కొనసాగిన ఆర్థిక కార్యకలాపాలు బుల్లెట్ రైళ్లతో ఒసాకా, నాగోయా వంటి ఇతర నగరాలకు విస్తరించాయి. బుల్లెట్ రైళ్లు జపాన్‌లో పరిశ్రమలు, సేవా రంగం వికేంద్రీకరణకు తోడ్పడ్డాయి. వాటివల్ల ఉపనగరాలు వేగంగా అభివృద్ధి చెందాయి. రియల్ ఎస్టేట్, పర్యాటకం ఊపందుకున్నాయి. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు జాతీయ అభివృద్ధి వ్యూహంగా మారాయి. హైస్పీడ్ రైళ్ల విషయంలో చైనా ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తోంది. గత ఇరవై ఏళ్లలో బుల్లెట్ రైళ్ల వ్యవస్థను ఆ దేశం భారీగా విస్తరించి ఆర్థిక విప్లవమే సృష్టించింది. బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ-షెంజెన్ వంటి కారిడార్లు చైనా ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా మారాయి. బుల్లెట్ రైళ్లతో చైనా తీర ప్రాంతాలను అనుసంధానించింది. వాటివల్ల వెనకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొన్నాయి. చిన్న నగరాలు ఆర్థిక కేంద్రాలుగా ఎదిగాయి. ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో నగరాల సమతుల అభివృద్ధికి బుల్లెట్ రైళ్లు తోడ్పడ్డాయి. పారిస్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు ఫ్రాన్స్ హైస్పీడ్ రైళ్లను వినియోగిస్తోంది. దానివల్ల చిన్న పట్టణాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. కార్లు, విమానాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించి, పర్యావరణ అనుకూల రవాణా సాధనంగా అవి నిలిచాయి. జపాన్, చైనాలు బుల్లెట్ రైళ్లను కేవలం వేగం కోసం కాకుండా, ప్రాంతీయ అసమానతలను తగ్గించేందుకు, ఆర్థిక విస్తరణకు వాడుకుంటున్నాయి.

### స్పష్టతతో సాగితేనే...

భారీ జనాభాతో పట్టణీకరణ శరవేగంగా సాగుతున్న ఇండియాకు బుల్లెట్ రైళ్లు విలాసం కాదు. పోటీ ప్రపంచంలో అవి ఒక అవసరం. ప్రయాణాలను వేగవంతం చేయడం ద్వారా బుల్లెట్ కారిడార్లు దేశ ఆర్థిక పటాన్ని మార్చే అవకాశం ఉంది. అయితే- ఖర్చులు, భూసేకరణ, పర్యావరణ అంశాలపై స్పష్టతతో ముందుకు సాగినప్పుడే హైస్పీడ్ రైల్ ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయడానికి వీలవుతుంది. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో చవిచూసిన సవాళ్లు, సమస్యల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. భూసేకరణ అంశం రాష్ట్రాల పరిధిలో ఉన్నందువల్ల కేంద్రం వాటితో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన ఆ ప్రక్రియను పూర్తిచేయాలి. అప్పుడే భారతదేశంలోని నగరాల మధ్య హైస్పీడ్ రైళ్లు వీలైనంత త్వరగా పరుగులు తీయడానికి అవకాశముంటుంది.

## ఆత్మగౌరవం ఇంకెవరి సొత్తు?



గూడు కట్టుకున్న రాజకీయ చైతన్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి అస్తిత్వం మీద బలమైన దెబ్బకొడుతారు. అస్తిత్వాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఆత్మగౌరవ హననానికి పాల్పడుతారు. తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే. అవును.. ఇదే జరుగుతున్నది. అందులో భాగమే ఆత్మగౌరవాన్ని ఆస్తిగా లెక్కలు వేస్తున్నారు. అందుకే ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా? అని ప్రశ్నిస్తున్నరు. కేసీఆర్ భుజం మీద తుపాకీ పెట్టి తెలంగాణపై విద్వేషపు తూటాలను పేలుస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యం కాదేమోనని అంతా విభ్రమలో ఉన్నప్పుడు.. అందరినీ తట్టిలేపి.. అందరి గొంతును తనగొంతుగా చేసుకొని.. అందరి చేతులను తనచేతల్లోకి తీసుకొని, పిడికిలెత్తి.. 'జై తెలంగాణ' అని దిక్కులు పిక్కటిల్లేలా వినిపించేలా కేక వేసిన నినాదం కేసీఆర్. ఆ కేసీఆర్‌నే తన ఆత్మగౌరవ ప్రతీకగా తెలంగాణ ఎంచుకున్నది. ఇప్పుడు ఆ ప్రతీక ఎక్కడిదని ఒక పత్రికాధిపతి ప్రశ్నిస్తున్నడు. తెలంగాణ నేలమీద నిలబడి పరాయిపాట పాడుతున్నడు. తెలంగాణ సోయితో ప్రజానీకం రోడ్ల మీదికొచ్చి 'చావో రేవో' తేల్చుకుందామని వీరోచిత పోరాటం చేస్తున్నప్పుడు.. ఆ ప్రజల మీదికి తుపాకీతో వెళ్లిన రైఫిల్‌రెడ్డి కూడా ఇప్పుడు ప్రశ్నిస్తున్నడు. తెలంగాణపై తమ అధికారం పోయిందని, తమ ఆధిపత్యం ప్రదర్శించే వేదిక తమ చేతుల్లోంచి జారిపోయిందని రంది పడేవారందరూ కూటమికట్టి మళ్లీ కాలకూటవిషాన్ని కక్కుతున్నరు. 'ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా ?' అని మళ్లీ మళ్లీ ప్రశ్నిస్తున్నరు. తెంపరితనాన్ని అతితెలివిగా ప్రదర్శిస్తున్నరు. అక్కడ.. ఇక్కడ పాలనా పగ్గాలు తన చెప్పుచేతుల్లో ఉన్నాయనే దురహంకారాన్ని, అహంభావాన్ని ఆ పత్రికాధిపతి బాహాటంగానే ప్రదర్శిస్తున్నడు. ఆ ప్రదర్శన వెనుక ఉన్న మర్మం ఏమిటో తెలుసుకోలేనంత అమాయకులు కారు తెలంగాణ ప్రజలు. తమ పట్ల.. ఇత్తేసి పొత్తుకూడి.., ఇసంత రమ్మంటే ఇల్లంత నాదే అనే గడుసుతనాన్ని ప్రదర్శించి, 'అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు' అన్నట్టుగా వ్యవహరించటం ఎప్పటికీ సాధ్యం కాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ తెలంగాణ సమాజం అనేక సందర్భాల్లో నిరూపించింది. ఇప్పుడు కూడా హెచ్చరిస్తున్నది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ప్రతి సందర్భంలోనూ ఉద్యమ నాయకత్వంపై నిలువెల్లా విషం చిమ్మినవాళ్లు, ఇప్పుడు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసహనం, వ్యతిరేకతను వెల్లడిస్తున్న నేపథ్యంలోనూ కేసీఆర్‌పై అదే అక్కసును వెల్లగక్కుతున్నారు. ఆ వ్యతిరేక వెల్లువ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్రల కత్తులను తెలంగాణ ఆత్మగౌరవం మీదికి విసురుతున్నరు. ఆంధ్ర.. జ్యోతివలె ప్రకాశించాలె.. తెలంగాణలో మాత్రం చీకటే రాజ్యమేలాలె' అనేది వారి ఎత్తుగడ. ఇందులో భాగంగా ఉద్దేశపూర్వకంగానే తెరమీదికి తెచ్చిన 'ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తా?' అనే ప్రశ్న. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తామని, కాంగ్రెస్ పాలక పెద్దలు ప్రగల్భాలు పలికిన ప్రతిసారీ కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో జరిగిన అద్భుతాలు.. దేశం అనుసరించే ఆదర్శాలుగా చర్చకు వస్తున్నాయి. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధికి నిలయమైందని ఆర్థిక సర్వే రూపంలో రుజువులు బయటికి వస్తున్నాయి. ఆ విషయాన్ని తెలంగాణ వ్యతిరేక శక్తులు జీర్ణించుకోవటం లేదు. అందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని తెలంగాణ ఆత్మగౌరవంపై దాడికి దిగుతున్నారు. కేసీఆర్ అంటే వ్యక్తికాదు.. తెలంగాణ రాజకీయ, అస్తిత్వ, రాజకీయ, సాంస్కృతిక చైతన్యాలకు ప్రతీక. ఆ ప్రతీకలతో రూపుదిద్దుకున్న ఆత్మగౌరవాన్ని అవహేళన, పలుచన చేయటానికి పనికట్టుకొని కొందరు జిత్తులమారి వేషాలు వేస్తున్నారు. కాంగ్రెస్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెట్టిందని ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రం చేసిప్పటి నుంచీ నాలుగు దశాబ్దాలుగా ఆ కీర్తికి మరక పడకుండా ఆయన అభిమానులు మెరుగు పెడుతూనే ఉన్నారు. కానీ, రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ ఆత్మగౌరవం కాలికి ముళ్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తున్న కేసీఆర్‌ను మాత్రం కించపరుస్తున్నారు. నీ తెలుగు నీకెంత గొప్పదో.. నా తెలంగాణ నాకంత గొప్పది. నీ ఎన్టీఆర్ నీకెంత ఆరాధ్యుడో మా కేసీఆర్ మాకూ అంతే ఆరాధ్యుడు. తెలంగాణ మనుగడ ప్రతీకలను దూరం చేయాలని ద్రోహులు రెండేండ్లుగా యథేచ్ఛగా కుట్రలు చేస్తూనే ఉన్నారు. కేసీఆర్ వల్ల.. కేసీఆర్ చేత ఉద్యమంలోకి వచ్చిన కొందరి పేర్లను కన్వీనియంట్‌గా వాడుకుంటూ రెండేండ్లుగా సందర్భం వచ్చిన ప్రతిసారీ తెలంగాణ ప్రజలను రెచ్చగొడుతూనే ఉన్నారు. కానీ, తెలంగాణ ప్రజలు అమాయకులు కారు. తెలంగాణ ప్రజల నుంచి కేసీఆర్‌ను, కేసీఆర్ నుంచి తెలంగాణ ప్రజలను వేరు చేయటం ఎవరితరమూ కాదు. ముమ్మాటికీ తెలంగాణ ఆత్మగౌరవం కేసీఆర్ సొత్తే. కేసీఆర్ మద్దతుదారులను కూలీలు అంటున్నారు. తెలంగాణ కోసం స్వప్నించాం. ఆ స్వప్నాన్ని సాధించటం కోసం దివారాత్రులు కూలీలుగానే పనిచేశాం.

## కుప్పకూలుతున్న బిట్‌కాయిన్ ధర! తలలు పట్టుకుంటున్న క్రిప్టో ఇన్వెస్టర్లు.. రానున్న రోజుల్లో..



బిట్‌కాయిన్ ధర 69,000 డాలర్లకు పడిపోగా, ఆర్థిక నిపుణులు ఇది 38,000 డాలర్లకు చేరవచ్చని హెచ్చరించారు. స్టిఫెల్ సంస్థ కూడా ఈ క్షీణతపై ఆందోళన వ్యక్తం చేసింది. చారిత్రక క్రాష్‌లను ఉదాహరిస్తూ, నాస్‌డాక్‌తో మారుతున్న సంబంధాన్ని విశ్లేషకులు గుర్తించారు. ఈ పతనం ఎక్కడ ఆగుతుందో అంచనా వేస్తున్నారు. బిట్‌కాయిన్ ధర గురువారం 69,000 డాలర్లకి పడిపోయింది. ఈ క్షీణత మరింత తీవ్రమవుతుందని, బిట్‌కాయిన్ 38,000 డాలర్లకి కూడా పడిపోవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ చుట్టూ ఉన్న సెంటిమెంట్ మరింత ప్రతికూలంగా మారుతోంది. ప్రస్తుత అమ్మకాలు ఎక్కడ ముగుస్తాయో నిపుణులు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ప్రఖ్యాత అమెరికన్ ఆర్థిక సేవల సంస్థ స్టిఫెల్, బిట్‌కాయిన్ మరింత క్షీణించే అవకాశం ఉందని హెచ్చరించింది. బారీ బి బన్నిస్టర్ నేతృత్వంలోని బృందం క్లయింట్‌లకు ఇచ్చిన నోట్‌లో బిట్‌కాయిన్ ఇప్పటికే గరిష్ట స్థాయి నుండి 41 శాతం తగ్గింది. చారిత్రక ధోరణుల ఆధారంగా తదుపరి కనిష్ట స్థాయి దాదాపు 38,000 డాలర్లు కావచ్చునని చెప్పారు. విశ్లేషకులు గతంలో జరిగిన బిట్‌కాయిన్ క్రాష్‌లను కూడా ఉదహరించారు. బిట్‌కాయిన్ 2011లో 93 శాతం, 2015లో 84 శాతం, 2018లో 83 శాతం, 2022లో దాదాపు 76 శాతం పడిపోయింది. ఈ గణాంకాలను కలిపితే ప్రస్తుత క్షీణత తదుపరి దశ దాదాపు 38,000 డాలర్లుగా కనిపిస్తోందని అంటున్నారు  అక్టోబర్‌లో 126,000 డాలర్లకు చేరుకున్న తర్వాత, బిట్‌కాయిన్ ఇప్పుడు బాగా పడిపోయింది. గురువారం ఇది 69,333 డాలర్లకు పడిపోయింది, ఇది నవంబర్ 2024 తర్వాత దాని కనిష్ట స్థాయి. బిట్‌కాయిన్ మారుతున్న ప్రవర్తనను వివరించడానికి స్టిఫెల్ బృందం "ది క్యూరియస్ కేస్ ఆఫ్ బెంజమిన్ బటన్" చిత్రాన్ని ఉదహరించింది. గతంలో డాలర్ బలహీనపడినప్పుడు బిట్‌కాయిన్ బలపడేది, కానీ ఇప్పుడు ఈ పద్ధతి మారిపోయింది. బిట్‌కాయిన్ ఇప్పుడు నాస్‌డాక్ 100, గ్రోత్ స్టాక్‌లతో మరింత దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఫెడ్ దుష్ట వైఖరిని చూపినప్పుడు బిట్‌కాయిన్ పెరుగుతుంది, అది బిగించే వైఖరిని సూచించినప్పుడు పడిపోతుంది. టెక్ కంపెనీలకు రుణ వ్యయాలు పెరగడం, స్టాక్ మార్కెట్‌లో ఒత్తిడి బిట్‌కాయిన్ ధరలను మరింత తగ్గించవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

## రైల్వే ప్రయాణికులకు పండగలాంటి వార్త.. హోలీ కోసం భారీగా స్పెషల్ ట్రైన్స్!



హోలీ పండుగ రద్దీని తగ్గించేందుకు భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వే భారీ ఏర్పాట్లు చేశాయి. రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెషల్ రైళ్లను నడపనుండగా, దేశవ్యాప్తంగా మొత్తం 1,410కి పైగా ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయి. మార్చిలో షెడ్యూల్ చేశారు. ఇండియాలో అతి పెద్ద పండగల్లో హోలీ కూడా ఒకటి. ఈ పండగకు చాలా మంది నగరాల నుంచి తమ స్వగ్రామాలకు వెళుంటారు. దాంతో రైళ్లల్లో రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ రద్దీని తట్టుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే ఇప్పటి నుంచే పక్కా ప్లాన్‌ను రెడీ చేస్తోంది. రికార్డు స్థాయిలో 160 హోలీ స్పెషల్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణాన్ని సులభతరం చేయడానికి భారతీయ రైల్వేలు దాని నెట్‌వర్క్ అంతటా 1,410 కి పైగా హోలీ స్పెషల్ రైళ్లను నడపాలని ప్లాన్ చేస్తోంది. ఈ ప్రత్యేక రైళ్లు మార్చిలో షెడ్యూల్ చేశారు. దక్షిణ మధ్య రైల్వే నుండి నడిచే ఈ ప్రత్యేక రైళ్లు విశాఖపట్నం, పాట్నా, రాజ్‌కోట్, సోలాపూర్, బిలాస్‌పూర్, దానాపూర్, రక్సౌల్, నహర్‌లగున్, హజ్రత్ నిజాముద్దీన్, షాలిమార్, హిసార్, లక్నో, సంత్రాగచి, మాల్దా టౌన్, చాప్రాతో పాటు అనేక ఇతర ముఖ్యమైన గమ్యస్థానాలను కవర్ చేస్తాయి. ఈ అన్ని గమ్యస్థానాల నుండి తిరుగు ప్రయాణాలను కూడా ప్లాన్ చేశారు, రెండు వైపులా ప్రయాణించే ప్రయాణీకులకు సమతుల్య కనెక్టివిటీ, సౌకర్యాన్ని అందిస్తారు. ఈ అదనపు సేవలు కాలానుగుణ డిమాండ్‌ను తీర్చడం ద్వారా రద్దీని గణనీయంగా తగ్గిస్తాయి, భారతదేశంలోని అనేక ప్రాంతాలకు ప్రత్యక్ష కనెక్టివిటీని అందిస్తాయి, ప్రయాణాలను వేగంగా, మరింత సౌకర్యవంతంగా చేస్తాయి, మెరుగైన జనసమూహ నిర్వహణ, సురక్షితమైన ప్రయాణం, మొత్తం మీద మెరుగైన ప్రయాణీకుల అనుభవాన్ని అందిస్తాయి. ప్రధాన పండుగల సమయంలో ప్రయాణీకుల సౌలభ్యం, భద్రత, సమర్థవంతమైన కార్యకలాపాలను నిర్ధారించడానికి దక్షిణ మధ్య రైల్వే ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుంది.

## తన కస్టమర్ల కోసం సూపర్ ఆఫర్లు తీసుకొచ్చిన ఎయిర్‌టెల్..! ఈ రీఛార్జ్‌లతో అన్‌లిమిటెడ్ బెనిఫిట్స్




ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం అపరిమిత 4+/5+ డేటాతో కూడిన కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌లను (రూ.399, రూ.449) ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్‌లు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ాామీలు అందిస్తాయి. అదనంగా, అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం, ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే, గూగుల్ వన్ వంటి ఉచిత ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎయిర్‌టెల్ తన యూజర్ల కోసం కొన్ని ప్రీపెయిడ్ ప్లాన్‌లతో పాటు అపరిమిత 4+ డేటాతో కూడిన ప్లాన్‌ను తీసుకొచ్చింది. ప్లాన్‌లు ఒకటే, కానీ డేటా ప్రయోజనాలను అన్‌లిమిటెడ్ చేసింది. ఈ అపరిమిత డేటా ప్రయోజనం 4+, 5+ యూజర్లకు అందుబాటులో ఉంది. ఈ ప్రయోజనాలు ఎయిర్‌టెల్ రూ. 399, రూ. 449 రీఛార్జ్ ప్లాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. రెండు ప్లాన్‌లు భారతదేశం అంతటా అందుబాటులో ఉన్నాయి. టెలికామ్‌టాక్ నివేదిక ప్రకారం భారతీ ఎయిర్‌టెల్ రూ. 399 ప్రీపెయిడ్ ప్లాన్ ఇప్పుడు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 లు, అపరిమిత 4+, 5+ డేటాను అందిస్తుంది. 30 రోజుల చెల్లుబాటుతో వినియోగదారులకు 300 +దీతో సహా అపరిమిత 4+, 5+ డేటాను అందిస్తున్నారు.

### ఒక సంవత్సరం పాటు అడోబ్ ఎక్స్‌ప్రెస్ ప్రీమియం

### ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ప్లేకి ఉచిత యాక్సెస్

### ఉచిత హెలోట్యూన్‌లు

### ఎయిర్‌టెల్ రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్

భారతీ ఎయిర్‌టెల్ రూ.449 ప్రీపెయిడ్ ప్లాన్ 28 రోజుల సర్వీస్ వాలిడిటీని కలిగి ఉంది. అయితే, కొత్త ప్లాన్‌తో, వినియోగదారులు 300 +దీ చెల్లుబాటుతో 30 రోజుల పాటు అపరిమిత 4+, 5+ డేటాను పొందుతున్నారు. వారు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ాామీలను కూడా పొందుతున్నారు.

## అసలు బంగారం ధరలు పెంచడం, తగ్గించడం ఎవరు చేస్తారో తెలుసా?











ఈ మధ్య కాలంలో బంగారం వెండి ధరలు విపరీతంగా పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. అయితే చాలా మంది ధరల పెరుగుదల, తగ్గుదలను మాత్రమే చూస్తారు. కానీ అసలు బంగారం, వెండి ధరలను ఎవరు పెంచుతారు? దీని వెనుక ఎవరు ఉంటారో చాలా మందికి తెలియదు, కాగా, ఇప్పుడు మనం దాని గురించే వివరంగా తెలుసుకుందాం.

మహిళలు ఎక్కువగా ఇష్టపడే దాంట్లో బంగారం ముందుంటుంది. చాలా మంది బంగారం , వెండి కొనుగోలు చేయడానికి ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ముఖ్యంగా, ఏ చిన్న శుభకార్యం జరిగినా సరే బంగారం కొనుగోలు చేయడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తారు. అయితే గతంలో బంగారం ధరలు స్థిరంగా కొనసాగేవి, కానీ ఈ మధ్య బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

**1 / 5**

మరి ఈ బంగారం ధరలను పెంచడం, తగ్గించడం ఎవరు చేస్తారో ఇప్పుడు చూద్దాం.  చాలా మంది బంగారం ధరలను సెంట్రల్ గవర్నమెంట్ నిర్ణయిస్తుంది, మోదీ పెంచుతారని, రిజర్వ్ బ్యాంకు బంగారం , వెండి ధరలను నిర్ణయిస్తుంది అనుకుంటారు.

**2 / 5**

కానీ బంగారం వెండి ధరలను సెంట్రల్ గవర్నమెంట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించదు. బంగారం, వెండి ధరల నిర్ణయించడంల కేవలం ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోషియేషన్ కీలక పాత్ర పోషిస్తుందంట. వీరే ప్రతి రోజు ధరలను పెంచడం తగ్గించడం చేస్తుంటారు.

**3 / 5**

ఐబీజేఏ అనే సంస్థ దేశంలోనే అతి పెద్ద బంగారం డీలర్స్ నుంచి కొనుగోలు, అమ్మకాలు జరుపుతుంది. వాటి అమ్మకం కోట్‌లను సేకరించి, వాటి సగటు ఆధారంగా బెంచ్ మార్క్ రేటును నిర్ణయిస్తుందంట. అలా బంగారం, వెండి ధరల్లో మార్పులు కనిపిస్తుంటాయి.

**4 / 5**

ముఖ్యంగా బంగారం, వెండి ధరల నిర్ణియించడంలో స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు కూడా ఉంటాయంట. అంతే కాకుండా , వీటికి ఓ పెద్ద ఫార్ములనే ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. మనం బంగారం ఎక్కువగా విదేశాల నుంచి కొనుగోలు చేస్తాం కాబట్టి, వాటి బులియన్ మార్కెట్ అసోసియేషన్ బట్టి, అమెరికా డాలర్ విలువలను బట్టి ధరలు నిర్ణయిస్తారు. ముఖ్యంగా లండన్ లేదా న్యూయర్ మార్కెట్‌లో ఔన్స్ సుమారు 31 గ్రాముల బంగారం రేటు ఎంత ఉందో చూస్తారంట. రూపాయి విలువ డాలర్స్ తో పోలిచ్చినప్పుడు

## బంగారం ఆం బ్యాంక్ ఎఫ్‌డి: మీ డబ్బును డబుల్ చేసే సత్తా దేనికి ఉంది?




డబ్బును పొదుపు చేయడంలో మన తల్లిదండ్రుల కాలం నుండి నేటి యువత వరకు ఉన్న ప్రధానమైన ఆలోచనలు రెండే.. ఒకటి బంగారం కొనడం, రెండోది బ్యాంకులో ఎఫ్‌డి (ఫ్ఞీణ) చేయడం. గతంలో గుడ్డిగా బ్యాంకుల్లో లేదా పోస్ట్ ఆఫీసుల్లో డబ్బులు దాచుకునేవారు. కానీ, ప్రస్తుత మారుతున్న కాలంలో స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్ల హడావిడి పెరిగినా, ఇప్పటికీ సేఫ్ అనిపించేది బంగారం మరియు ఎఫ్‌డిలే. అయితే, మీ డబ్బు త్వరగా రెట్టింపు కావాలంటే ఈ రెండింటిలో ఏది ఉత్తమమో తెలుసుకోవడం చాలా అవసరం. బంగారాన్ని ప్రపంచవ్యాప్తంగా సురక్షిత స్వర్గధామంగా పరిగణిస్తారు. దేశాల మధ్య యుద్ధాలు వచ్చినా, కరెన్సీ విలువ పడిపోయినా బంగారం విలువ మాత్రం రాకెట్‌లా దూసుకుపోతుంది. మరోవైపు, బ్యాంకు ఎఫ్‌డిలు మీకు ఒక స్థిరమైన రాబడికి గ్యారెంటీ ఇస్తాయి. కానీ, బ్యాంకు దివాలా తీస్తే మీ డిపాజిట్‌పై ప్రభుత్వం ఇచ్చే ఇన్సూరెన్స్ పరిమితి కేవలం 5 లక్షల రూపాయలే అన్న చేదు నిజాన్ని కూడా మర్చిపోకూడదు. ఈ రెండింటి మధ్య ఉన్న లాభనష్టాలు వ్యత్యాసాలను ఇప్పుడు వివరంగా విశ్లేషిద్దాం.

**బంగారం -- సురక్షితమైన ఆస్తి:**

ధరల పెరుగుదల: ద్రవ్యోల్బణం పెరిగే కొద్దీ బంగారం ధర కూడా పెరుగుతుంది. అంటే మీ డబ్బు విలువ తగ్గకుండా ఇది కాపాడుతుంది.

క్విడిటీ: అత్యవసర సమయంలో బంగారాన్ని ఎక్కడైనా, ఎప్పుడైనా అమ్మి తక్షణమే నగదు పొందవచ్చు లేదా తాకట్టు పెట్టి రుణం తీసుకోవచ్చు.

దీర్ఘకాలిక లాభం: స్వల్పకాలంలో ధరలు హెచ్చుతగ్గులకు లోనైనా, దీర్ఘకాలంలో బంగారం ఎప్పుడూ నష్టాన్ని మిగల్చలేదు.

**బ్యాంక్ ఎఫ్‌డి -- స్థిరమైన రాబడి:**

స్థిరత్వం: మీరు ఎఫ్‌డి చేసిన రోజే మెచ్యూరిటీ తర్వాత మీకు ఎంత వడ్డీ వస్తుంది, ఎంత మొత్తం అందుతుందనే దానిపై పూర్తి స్పష్టత ఉంటుంది.

భద్రత: భారత ప్రభుత్వం డీఐసీజీసీ (ణ×జ+జ) కింద రూ. 5 లక్షల వరకు బీమా అందిస్తుంది. మీ డిపాజిట్ ఎంత ఉన్నా, బ్యాంకు సమస్యల్లో పడితే గరిష్టంగా 5 లక్షలు మాత్రమే సురక్షితంగా అందుతాయి. మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా మీ వడ్డీ మీకు జమ అవుతూ ఉంటుంది.

**ఏది ఎంచుకోవాలి?**

మీకు నెలవారీ స్థిర ఆదాయం కావాలి, ఎటువంటి రిస్క్ వద్దు అనుకుంటే బ్యాంక్ ఎఫ్‌డి సరైనది. అలా కాకుండా, దీర్ఘకాలికంగా ఆస్తి విలువ పెరగాలి, ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలి అనుకుంటే బంగారం మేలైనది. ఆర్థిక నిపుణుల సలహా ప్రకారం.. మీ పెట్టుబడిని ఏదో ఒక దానికే పరిమితం చేయకుండా, కొంత ఎఫ్‌డిలో మరియు కొంత బంగారంలో ఉంచడం అత్యంత తెలివైన పని. ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. పెట్టుబడి పెట్టే ముందు మార్కెట్ నిబంధనలు, వడ్డీ రేట్లను సరిచూసుకోవడం శ్రేయస్కరం.

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు ఆపేస్తుందా? విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు



రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. మార్కెట్ పరిస్థితులు, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల ఆధారంగా భారతదేశం తన ఇంధన కొనుగోళ్లను వైవిధ్యపరుస్తుందని ఆయన అన్నారు. "మన అవసరాలకు అనుగుణంగా ప్రపంచంలోని ఏ దేశం నుండైనా చమురు కొనుగోలు చేయవచ్చు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం ఉంటుంది. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలు దేశప్రజలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవడం జరుగుతుంది." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారతదేశంతో ఇంధన సహకారం కొనసాగుతుందని రష్యా కూడా పేర్కొంది. "భారతదేశం వైఖరిలో ఎటువంటి మార్పు లేదు. మా వాణిజ్యం రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుంది" అని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. వెనిజులా నుండి చమురు కొనుగోలుకు సంబంధించి, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. వెనిజులా ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడి రంగాలలో దీర్ఘకాల భాగస్వామిగా ఉందని పేర్కొంది. "మేము 2019-20 వరకు వెనిజులా నుండి ఇంధనం, ముడి చమురును దిగుమతి చేసుకున్నాము, ఆ తర్వాత ఆపాల్సి వచ్చింది. అనంతరం 2023-24లో వెనిజులా నుండి చమురు కొనుగోలు చేయడం ప్రారంభించాము, కానీ ఆంక్షలు విధించిన తర్వాత ఆపాల్సి వచ్చింది" అని రణధీర్ జైస్వాల్ అన్నారు. "ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి, సుంకాల తగ్గింపుకు అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులు ఇప్పుడు 18% తక్కువ సుంకంతో అమెరికాకు ఎగుమతి చేయబడతాయని ప్రధాని అన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం మన ఎగుమతులను పెంచుతుంది. ఇది భారతదేశంలో శ్రమతో కూడిన పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుంది. కొత్త ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మన ప్రజలకు వృద్ధి, శ్రేయస్సు సాధిస్తారు." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలావుంటే, ఇరాన్‌లో బందీలుగా ఉన్న 16 మంది భారతీయుల గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. "ఇరాన్‌లోని 16 మంది నావికులను కలవడానికి మాకు అనుమతి లభించింది. మా అధికారులు బందర్ అబ్బాస్‌లో వారిని కలిశారు. 16 మందిలో ఎనిమిది మంది విడుదలై స్వదేశానికి తిరిగి వస్తున్నారు. మిగిలిన ఎనిమిది మంది గురించి మేము ఇరాన్ అధికారులతో సంప్రదిస్తున్నాము. వారికి ఎలా సహాయం చేయవచ్చో చూస్తున్నాము." అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## సావరిన్ గోల్డ్ బాండ్ ఇన్వెస్టర్లకు గుడ్‌న్యూస్..! మార్కెట్‌ను చూసి భయపడొద్దు..




వీజశలో ట్రేడవుతున్న ా+దీ బాండ్లు ఇటీవల 1-5.3 శాతం తగ్గుదల చూపాయి, ఇది స్వల్పకాలిక పెట్టుబడిదారులలో ఆందోళన కలిగించింది. అంతర్జాతీయ బంగారం ధరల హెచ్చుతగ్గులు, పరిమిత ద్రవ్యత ఈ క్షీణతకు కారణం. అయితే, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది తక్కువ ధరకు ా+దీలను కొనుగోలు చేసే అవకాశాన్ని అందిస్తుంది. 2029, 2031 మధ్య వీజశలో ట్రేడవుతున్న సావరిన్ గోల్డ్ బాండ్ (ా+దీ) సిరీస్ ఇటీవల గణనీయమైన ఒత్తిడిని చూసింది. వివిధ సిరీస్‌లు 1 శాతం నుండి 5.30 శాతం వరకు తగ్గుదల చూశాయి. ఈ తగ్గుదల స్వల్పకాలిక పెట్టుబడిదారులలో కొంత ఆందోళనను కలిగించింది. అయితే పరిస్థితిని దీర్ఘకాలిక దృక్పథం నుండి భిన్నంగా చూడాలి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అంతర్జాతీయ స్థాయిలో బంగారం ధరలలో హెచ్చుతగ్గులు, వడ్డీ రేట్లకు సంబంధించి అనిశ్చితి, ద్వితీయ మార్కెట్లో పరిమిత ద్రవ్యత ఈ తగ్గుదలకు ప్రధాన కారణం. ా+దీ బాండ్ల ప్రధాన ప్రయోజనం ఏమిటంటే పరిపక్వత సమయంలో బంగారం ధర, ప్రతి సంవత్సరం పొందే స్థిర వడ్డీకి లింక్ అయిన రాబడి, కానీ ద్వితీయ మార్కెట్‌లో ధరలలో అస్థిరత ఉంటుంది. ముఖ్యంగా 2029, 2031 మధ్య మెచ్యూరిటీ అవుతున్న సిరీస్‌లో, పరిపక్వతకు ఇంకా సమయం మిగిలి ఉన్నందున, స్వల్పకాలిక అమ్మకాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. కొంతమంది పెట్టుబడిదారులు లాభాలను బుక్ చేసుకోవడానికి లేదా ఇతర పెట్టుబడి ఎంపికలకు మారడానికి అమ్ముతున్నారు, దీని కారణంగా పగటిపూట ధరలు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిలో ఈ తగ్గుదల దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు కూడా ఒక అవకాశంగా ఉంటుంది. ఒక పెట్టుబడిదారుడు బంగారంలో ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టాలని ప్లాన్ చేస్తే, డిస్కౌంట్‌తో లభించే ా+దీ సిరీస్ భవిష్యత్తులో మంచి రాబడిని ఇస్తుంది. ప్రభుత్వం మెచ్యూరిటీ సమయంలో బంగారం మార్కెట్ ధరకు చెల్లిస్తుంది కాబట్టి, ప్రాథమిక ప్రయోజనం మారదు. అందువల్ల ప్రస్తుత అస్థిరత గురించి భయపడాల్సిన అవసరం లేదు, కానీ మీ ఆర్థిక అవసరాలు, పెట్టుబడి క్షితిజం, రిస్క్ టాలరెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం ముఖ్యం. ా+దీ అనేది దీర్ఘకాలిక, సురక్షితమైన, పన్ను-ప్రయోజనకరమైన పెట్టుబడి ఎంపిక, స్వల్పకాలిక మార్కెట్ కదలికలను తెలివిగా గమనించడం తెలివైన విధానం.

## మీ జీతం ఎంత తక్కువైనా పర్లేదు..

# ఈ రూల్ పాటిస్తే మీరే ధనవంతులు!

**50-30-20 రూల్ అనేది వ్యక్తిగత ఖర్చులను నియంత్రించి పొదుపును పెంచుకోవడానికి ఒక ప్రభావవంతమైన బడ్జెటింగ్ విధానం. నికర ఆదాయంలో 50 శాతం అవసరాలకు, 30 శాతం కోరికలకు, మిగిలిన 20 శాతం పొదుపు, పెట్టుబడులకు కేటాయించడం ద్వారా ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుంది.**



వ్యక్తిగత ఖర్చులను నియంత్రించి పొదుపును పెంచుకోవాలనుకునే వారికి 50-30-20 రూల్ ఒక సులభమైన, సమర్థవంతమైన బడ్జెటింగ్ విధానంగా మారుతోంది. ఆర్థిక నిపుణుల ప్రకారం.. ఈ నియమాన్ని సరైన విధంగా అమలు చేస్తే నెలవారీ జీతాన్ని సమతుల్యంగా వినియోగించుకోవడంతో పాటు భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భద్రత ఏర్పడుతుంది. ఈ విధానం ప్రకారం వ్యక్తి తన నికర ఆదాయాన్ని మూడు భాగాలుగా విభజించాలి. మొత్తం ఆదాయంలో 50 శాతం అవసరమైన ఖర్చులకు కేటాయించాలి. వీటిలో ఇల్లు అద్దె, కిరాణా సరుకులు, విద్యుత్ బిల్లులు, రవాణా వంటి తప్పనిసరి ఖర్చులు వస్తాయి. ఖర్చులు ఈ పరిమితిని దాటకుండా చూసుకోవడం ఈ నియమంలోని మొదటి మెట్టు. తదుపరి 30 శాతం వ్యక్తిగత కోరికలు లేదా జీవనశైలి ఖర్చులకు కేటాయించాలి. ఇందులో బయట భోజనం, సినిమాలు, షాపింగ్, ట్రావెల్ వంటి అవసరం కాని కానీ మనసుకు ఆనందం ఇచ్చే ఖర్చులు ఉంటాయి. నిపుణులు చెబుతున్నదేమిటంటే ఈ భాగాన్ని నియంత్రణలో ఉంచితే ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. మిగిలిన 20 శాతం తప్పనిసరిగా పొదుపు, పెట్టుబడులకు మళ్లించాలి. ఇందులో ఎమర్జెన్సీ ఫండ్, రిటైర్మెంట్ సేవింగ్స్, మ్యూచువల్ ఫండ్లు లేదా ఇతర పెట్టుబడులు ఉండవచ్చు. ముఖ్యంగా ఈ 20 శాతం భాగాన్ని ముందుగా విడిగా ఉంచడం మంచి అలవాటుగా భావిస్తున్నారు. అయితే ఆదాయం తక్కువగా ఉన్నవారు లేదా పెద్ద నగరాల్లో అధిక అద్దె చెల్లించే వారు ఈ శాతాలను కొంతవరకు మార్చుకోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ఖర్చు, పొదుపు మధ్య సమతుల్యతను నేర్పే ప్రాథమిక ఫ్రేమ్‌వర్క్‌గా 50-30-20 రూల్ ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ పొందుతోంది. సరైన క్రమశిక్షణతో అమలు చేస్తే దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

## అభిషేక్ త్వరగా అవుటవ్వడమే మంచిదైంది..

# మాజీ కోచ్ సంచలన వ్యాఖ్యలు

**టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లినప్పటికీ, జట్టులోని కొందరు యువ ఆటగాళ్ల ఫామ్ ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ముఖ్యంగా ఐపీఎల్‌లో సిక్సర్ల వర్షం కురిపించి, భారీ అంచనాలతో బరిలోకి దిగిన అభిషేక్ శర్మకు ఈ మెగా టోర్నీ ఒక పీడకలలా మారింది.**



టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్లినప్పటికీ, జట్టులోని కొందరు యువ ఆటగాళ్ల ఫామ్ ఇంకా ఆందోళనకరంగానే ఉంది. ముఖ్యంగా ఐపీఎల్‌లో సిక్సర్ల వర్షం కురిపించి, భారీ అంచనాలతో బరిలోకి దిగిన అభిషేక్ శర్మకు ఈ మెగా టోర్నీ ఒక పీడకలలా మారింది. జింబాబ్వేపై మెరుపు హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నప్పటికీ, ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో వరుసగా విఫలమవుతూ వస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన సూపర్ 8 పోరులో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. బ్యాటింగ్‌లోనే కాదు, ఫీల్డింగ్‌లో కూడా అభిషేక్ రెండు ఈజీ క్యాచ్‌లను చేజార్చి జట్టును ఇబ్బందుల్లోకి నెట్టాడు. అయితే అతడి వైఫల్యంపై టీమిండియా మాజీ కోచ్ అభిషేక్ నాయర్ చేసిన విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిషేక్ శర్మ త్వరగా అవుట్ అవ్వడం టీమిండియాకే మేలు చేసిందని నాయర్ అనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా ఏ కోచ్ అయినా తన ఆటగాడు అవుట్ అయితే బాధపడతాడు, కానీ నాయర్ మాత్రం అభిషేక్ శర్మ అవుట్ అవ్వడాన్ని సానుకూల కోణంలో చూశారు. టీ20 క్రికెట్ అనేది కేవలం ఎక్కువ పరుగులు చేయడం మాత్రమే కాదు, తక్కువ బంతుల్లో ఎక్కువ ఇంపాక్ట్ చూపించడం అని ఆయన అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 11 బంతులు ఆడి కేవలం 10 పరుగులు మాత్రమే చేశాడు. ఆ సమయంలో అతడు క్లీన్ హిట్టింగ్ చేయలేక స్ట్రగుల్ అవుతున్నట్లు కనిపించింది. ఒకవేళ అభిషేక్ అలాగే క్రీజులో ఉండి మరిన్ని బంతులు వృధా చేసి ఉంటే, రన్ రేట్ తగ్గిపోయేదని నాయర్ పేర్కొన్నారు. టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్ ఫామ్‌లో లేనప్పుడు లేదా బంతిని సరిగ్గా టైమ్ చేయలేనప్పుడు, త్వరగా అవుట్ అయిపోవడమే మంచిదని, దీనివల్ల తర్వాతి వచ్చే బ్యాటర్లకు ఎక్కువ సమయం దొరుకుతుందని ఆయన వివరించారు. అభిషేక్ నాయర్ తన వాదనను సమర్థిస్తూ షాయ్ హోప్ ఉదాహరణను కూడా ప్రస్తావించారు. వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ పవర్‌ప్లే అంతా ఆడి ఆ తర్వాత అవుట్ అయ్యాడని, అది ఆ జట్టుకు నష్టం కలిగించిందని గుర్తు చేశారు. అదే రీతిలో అభిషేక్ శర్మ కూడా 9 బంతుల్లో 9 పరుగులు చేస్తున్నప్పుడు మరింత సమయం తీసుకోవాలని చూడకుండా, షాట్లు ఆడబోయి అవుట్ అవ్వడం సరైన నిర్ణయమేనని నాయర్ అన్నారు. దీనివల్ల సంజు శాంసన్, తిలక్ వర్మ వంటి ఆటగాళ్లకు ఇన్నింగ్స్ నిర్మించడానికి తగినంత సమయం లభించిందని ఆయన విశ్లేషించారు. టీమిండియా గెలవాలంటే రన్ రేట్ పడిపోకుండా చూసుకోవడం ముఖ్యం కాబట్టి, అభిషేక్ శర్మ తన వికెట్ త్యాగం చేయడం జట్టుకే లాభం చేకూర్చిందని ఆయన చమత్కరించారు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విఫలమైనప్పటికీ, టీమిండియాను సంజు శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సంజు కేవలం 50 బంతుల్లోనే 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతడికి తోడుగా తిలక్ వర్మ 27 పరుగుల కీలక సహకారం అందించగా, చివర్లో శివమ్ దూబే మెరుపులు మెరిపించాడు. ఒకవేళ ఓపెనర్ అభిషేక్ శర్మ ఎక్కువ బంతులు ఆడి స్లోగా పరుగులు చేసి ఉంటే, లక్ష్యం మరింత కష్టమయ్యేదని అభిమానులు కూడా ఇప్పుడు నాయర్ మాటలతో ఏకీభవిస్తున్నారు. అయితే సెమీఫైనల్ వంటి పెద్ద మ్యాచుల్లో అభిషేక్ శర్మ తన సహజసిద్ధమైన దూకుడును ప్రదర్శించి, కనీసం పవర్‌ప్లేలో మెరుపులు మెరిపించాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ముఖ్యంగా అభిషేక్ శర్మ ఫీల్డింగ్ లోపాలు జట్టుకు ఆందోళన కలిగిస్తున్నాయి. వెస్టిండీస్ ఇన్నింగ్స్ సమయంలో రెండు లాలీపాప్ వంటి క్యాచ్‌లను జారవిడచడం చూస్తుంటే, అతడు మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు కనిపిస్తోంది. గిల్, సంజు శాంసన్ వంటి సీనియర్ ప్లేయర్లు ఒకవైపు రాణిస్తుంటే, యువ ఆటగాడైన అభిషేక్ పై ఒత్తిడి పెరగడం సహజమే. అయితే సెమీఫైనల్లో ఇంగ్లాండ్ వంటి బలమైన ప్రత్యర్థితో తలపడేటప్పుడు ఫీల్డింగ్ మిస్టేక్స్ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. కోచ్ గంభీర్ కూడా ఫీల్డింగ్ విషయంలో రాజీ పడకూడదని ఆటగాళ్లను హెచ్చరించిన నేపథ్యంలో, సెమీస్ నాటికి అభిషేక్ తన లోపాలను సరిదిద్దుకుంటాడని భావిస్తున్నారు. మొత్తానికి 2026 టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ పోరుకు సర్వం సిద్ధమైంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్-ఇంగ్లాండ్ తలపడనున్నాయి. అభిషేక్ శర్మ తనను తాను నిరూపించుకోవడానికి ఇదొక సువర్ణావకాశం. ఒకవేళ ఇక్కడ కూడా విఫలమైతే, టీమిండియాలో అతడి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. నాయర్ అన్నట్లు వికెట్ త్యాగం చేయడం అప్పుడప్పుడు జట్టుకు మేలు చేయవచ్చు కానీ, ఒక ఓపెనర్‌గా జట్టుకు అదిరిపోయే ఆరంభం ఇవ్వడమే అతడి అసలు బాధ్యత. మరి వాంఖడే గడ్డపై ఈ యంగ్ సెన్సేషన్ పుంజుకుంటాడా లేక తన పేలవ ప్రదర్శనను కొనసాగిస్తాడా అనేది తెలియాలంటే మరో మూడు రోజులు వేచి చూడాల్సిందే.

## వెస్టిండీస్‌పై భారత్ ఘనవిజయం- నేరుగా సెమీఫైనల్‌లోకి ఎంట్రీ

### వరల్డ్ కప్ 2025- వెస్టిండీస్ పై భారత్ విక్టరీ- ఇంటిముఖం పట్టిన వెస్టిండీస్

ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ సూపర్-8 కీలక పోరులో భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసి, భారత్ అధికారికంగా సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 196 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో సంజూ శాంసన్ ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. విండీస్‌ను కట్టడి చేసిన బుమ్రా టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ను ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. విండీస్ బ్యాటర్లు ఆరంభం నుంచే ధాటిగా ఆడారు. ఓపెనర్లు షై హోప్, రోస్టన్ ఛేజ్ ఆరంభంలో మంచిగా రాణించారు. రోస్టన్ ఛేజ్ 40 పరుగులు చేయగా, షై హోప్ 32 పరగులు చేశారు. ఆ తర్వాత వచ్చిన షిమ్రోన్ హెట్‌మయెర్ పరుగుల వేగాన్ని మరింత పెంచాడు. కేవలం 12 బంతుల్లోనే 27 పరగులు చేశాడు.

## ఔషధాల పుదీనా మొక్కను ఇంట్లో ఈజీగా పెంచుకోవచ్చు.. గుబురుగా పెరగాలంటే మాత్రం ఇలా చేయాల్సిందే



పుదీనా మొక్కను ఇంట్లో సులభంగా పెంచుకోవడానికి రెండు మార్గాలున్నాయి.. నీటిలో లేదా నేరుగా మట్టిలో పెంచుకోవచ్చు.. సరైన నేల, తగినంత సూర్యరశ్మి తగలాలి.. అలాగే.. చిగుర్లను కత్తిరించడం వల్ల మొక్క గుబురుగా పెరుగుతుంది. విటమిన్లు, ఖనిజాలతో కూడిన పుదీనా, ఆరోగ్య ప్రయోజనాలతో పాటు తెగుళ్ల నియంత్రణలోనూ సహాయపడుతుంది.

ఔషధాల పుదీనా మొక్కను ఇంట్లో ఈజీగా పెంచుకోవచ్చు.. గుబురుగా పెరగాలంటే మాత్రం ఇలా చేయాల్సిందే

పుదీనాలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి. పుదీనాను అన్ని కాలాలలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది చట్నీల నుండి సలాడ్లు, పానీయాల వరకు ప్రతిదానికీ తాజాదనాన్ని జోడిస్తుంది.. ఇంకా ఆరోగ్యాన్ని కాపాడటంలో ఎంతో సహాయపడుతుంది. పుదీనాలో విటమిన్ ఎ, జ, దీ కాంప్లెక్స్, కాల్షియం, ఐరన్, పొటాషియం, మాంగనీస్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది తక్కువ కేలరీలు.. అధిక ఫైబర్ కలిగి ఉన్న అద్భుతమైన ఔషధం.. ఇది జీర్ణక్రియను సైతం మెరుగుపరుస్తుంది.. ఇంకా నోటి ఆరోగ్యాన్ని పెంచి.. శ్వాసను తాజాగా ఉంచుతుంది. ఇలాంటి పుదీనాను ఇంట్లో పెంచుకుని.. పుదీనా నీటిని, సలాడ్లలో ఉపయోగించవచ్చు.. ఇది వేసవిలో మరింత చల్లదనాన్ని ఇస్తుంది. వేసవి కాలంలో పుదీనా జ్యూస్ తాగడం వల్ల శరీరం చల్లబడుతుంది. అందుకే.. ఈ మొక్కను దాదాపు అందరూ సులువుగా ఇళ్లల్లో పెంచుకోవచ్చు.. వాస్తవానికి పుదీనా, ఇంట్లో సులభంగా పెంచుకోవడానికి అనువైన ఒక బహుముఖ మొక్క. దీని పెంపకం, సంరక్షణ, ఆరోగ్య ప్రయోజనాల గురించి ఈ ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.. పుదీనా మొక్కను ఇంట్లో పెంచుకోవడం చాలా సులభం.. దుకాణం నుండి తెచ్చిన ముదురు పుదీనా కొమ్మలను ఎంచుకోవడం వల్ల అవి త్వరగా వేర్లు తొడుగుతాయి. నీటిలో పెంచే పద్ధతిలో, కొమ్మలను నీటిలో ఉంచి, ప్రతి మూడు రోజులకు నీటిని మార్చాలి. ఒక వారం నుండి పది రోజులలో వేర్లు ఏర్పడిన తర్వాత, వాటిని మట్టిలోకి మార్చుకోవచ్చు. నేరుగా మట్టిలో నాటడానికి, వేర్లు ఉన్న కొమ్మలను ఎంచుకోవడం ఉత్తమం.. ఇవి సులువుగా పెరుగుతాయి.. పుదీనా మొక్కకు లోతు తక్కువ ఉన్న కంటైనర్లు సరైనవి.. ఎందుకంటే ఇది అడ్డంగా విస్తరిస్తుంది. బాగా ఎండిపోయే మట్టిని ఉపయోగించాలి.. ఇందులో 40% గార్డెన్ సాయిల్, 40% వర్మీకంపోస్ట్, 20% కోకోపీట్, కొద్దిగా నీమ్ పౌడర్ ఉండాలి. ఇది గార్డెన్ లో ఇతర మొక్కల చుట్టూ నాటినప్పుడు దాని సువాసనతో తెగుళ్లను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. మట్టిలో నాటేటప్పుడు, కనీసం రెండు అంగుళాల నుండి మూడు అంగుళాల లోతులో రెండు కణుపులు మట్టిలోకి వెళ్లేలా చూసుకోవాలి. ఇది వేగవంతమైన వేరు పెరుగుదలకు సహాయపడుతుంది. పుదీనా మొక్క పూర్తి సూర్యరశ్మిలో బాగా పెరుగుతుంది. బాల్కనీలలో పెంచేవారు కనీసం 4 నుండి 5 గంటల ఎండ తగిలే ప్రదేశంలో ఉంచవచ్చు..

మొక్క గుబురుగా పెరగడానికి..

పుదీనా ఒక చాలా సులభంగా పెరగడంతోపాటు.. సంవత్సరమంతా దిగుబడిని ఇస్తుంది. మొక్క గుబురుగా పెరగడానికి, చిగుర్లు వచ్చిన తర్వాత వాటిని కత్తిరించాలి. ఇది కొత్త చిగుర్లు రావడానికి మొక్క నిండుగా పెరగడానికి తోడ్పడుతుంది. అలాగే, ఎండిపోయిన కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయడం ముఖ్యం. పుదీనా నేలపై అల్లుకుపోయే స్వభావం కలది కాబట్టి, గాలి ప్రసరణ సరిగా లేకపోతే ఫంగస్ వచ్చే అవకాశం ఉంది. అందుకే, మంచి గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలి. మరిన్ని లైఫ్‌స్టైల్ వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

## 'కళ్లు తిరగడం, తలనొప్పి'గా ఉంటోందా- మీరూ ఈ తప్పు చేస్తున్నారేమో చెక్ చేసుకోండి!

### డీహైడ్రేషన్ లక్షణాలు

### రోజుకు ఎంత వాటర్ తాగాలి



శరీరానికి తగినంత నీరు అవసరమని డాక్టర్లు పదేపదే చెబుతుంటారు. రోజుకు కనీసం 1.5 నుంచి 2 లీటర్లు నీళ్లు తాగాలంటున్నారు. కానీ, ఈ ఉరుగులు, పరుగుల జీవితంలో చాలామంది ఈ విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. దీంతో డీహైడ్రేషన్ కు గురవ్వడం, శరీర అవయవాల పనితీరు మందగించడం తదితర సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారు. అయితే డీహైడ్రేషన్ కు గురైనప్పుడు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

నిరంతర అలసట :

చాలా మంది రాత్రిళ్లు బాగా నిద్రపోయినప్పటికీ.. ఉదయం అలసటగా ఫీల్ అవుతుంటారు. అందుకు శరీరంలో నీటి శాతం తక్కువగా ఉండడమే కారణం అంటున్నారు నిపుణులు. నీరు తగ్గినప్పుడు రక్త పరిమాణం తగ్గుతుందని చెబుతున్నారు. దీనివల్ల ఆక్సిజన్, పోషకాలను సరఫరా చేయడానికి గుండె మరింత కష్టపడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

నెమ్మదిగా మొదలయ్యే తలనొప్పి :

శరీరంలో నీటి శాతం తగ్గిపోయినప్పుడు, మెదడు కణజాలం తాత్కాలికంగా కుంచించుకుపోవచ్చంటున్నారు నిపుణులు. దీనివల్ల ఏర్పడే ఒత్తిడి మార్పులు తలనొప్పికి దారితీస్తుందని పేర్కొంటున్నారు. అయితే, నీరు సరిగా తాగడం వల్ల ఇలాంటి తలనొప్పులు తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరం డీహైడ్రేషన్ కు గురైనప్పుడు తలనొప్పి, అలసట, ఆకలి లేకపోవడం లేదా చక్కెర తినాలనే కోరిక, కండరాల తిమ్మిరి, మలబద్ధకం లాంటి లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది. కండరాలు బలంగా ఉండాలా - నిపుణులు సూచిస్తున్న డైట్ టిప్స్ ఇవే!

పొడిబారిన చర్మం :

చర్మం మన శరీరంలో అతిపెద్ద అవయవం. డీహైడ్రేషన్ గా ఉన్నప్పుడు చర్మం కాంతివిహీనంగా లేదా తక్కువ సాగే గుణంతో కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై చిన్న చిన్న గీతలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొంటున్నారు.

ముదురు రంగు మూత్రం :

మూత్రం రంగు మన ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తుంది. లేత గడ్డి రంగులో ఉంటే హైడ్రేషన్ గా ఉన్నట్లు, ముదురు పసుపు రంగులో ఉంటే శరీరానికి మరిన్ని ద్రవాలు అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు.

మలబద్ధకం :

జీర్ణక్రియ సాఫీగా సాగడానికి నీరు చాలా ముఖ్యం. శరీరంలో తగినంత నీరు లేనప్పుడు, వ్యర్థాల నుంచి పేగులు నీటిని పీల్చుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మలం గట్టిపడి మలబద్ధకం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అకస్మాత్తుగా తీపి పదార్థాలు తినాలనిపించడం : తీపి కోరికలు ఎప్పుడూ ఆకలి వల్లనే కలగవు. కాలేయం శక్తి కోసం గ్లూకోజ్‌ను విడుదల చేయాలంటే నీరు అవసరం. హైడ్రేషన్ తగ్గినప్పుడు ఈ ప్రక్రియ మందగిస్తుందంటున్నారు నిపుణులు. దీంతో మెదడు చక్కెర అవసరమని తప్పుగా అర్థం చేసుకుంటుందని చెబుతున్నారు.

కండరాల తిమ్మిర్లు, కళ్లు తిరగడం :

సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత నీటిపై ఆధారపడి ఉంటుంది. నీరు లేకపోతే కండరాలు సులభంగా తిమ్మిర్లకు గురవుతాయంటున్నారు నిపుణులు. అలాగే, త్వరగా లేచి నిలబడినప్పుడు కళ్లు తిరిగినట్లు అనిపించవచ్చని వివరిస్తున్నారు.

ఎంత నీరు తాగాలి: శరీరానికి ఎంత నీరు అవసరమనేది.. వయస్సు, వాతావరణం, శ్రమను బట్టి మారుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా పెద్దలు రోజుకు 2 నుంచి 3 లీటర్ల ద్రవాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. స్థిరమైన శక్తి, లేత రంగు మూత్రం, క్రమబద్ధమైన మూత్ర విసర్జన వంటివి మీరు తగినంత హైడ్రేటెడ్‌గా ఉన్నారని చెప్పే స్పష్టమైన సంకేతాలని తెలియజేస్తున్నారు. మామూలుగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని అధ్యయనం పేర్కొంది. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## విమర్శలకు సంజు శాంసన్ మాస్ రివెంజ్- ఆ పోరాటం వెనుక ఎమోషనల్ మూమెంట్

### 50 బంతుల్లో 97 పరుగులతో సంజు శాంసన్ ఒంటరి పోరాటం- విజయం తర్వాత సంజు తన మనసులోని మాటలను పంచుకున్న సంజు శాంసన్






టీ20 వరల్డ్ కప్ లో నిన్న జరిగిన డూ ఆర్ డై మ్యాచ్ లో టీమిండియా అద్భుత విజయం సాధించి సెమీ ఫైనల్ కు దూసుకెళ్లింది. ఈ గెలుపులో స్టార్ బ్యాటర్ సంజు శాంసన్ పోషించిన పాత్ర వెలకట్టలేనిది. గత కొంతకాలంగా సరైన ఫామ్ లేక విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో, అత్యంత ఒత్తిడి ఉన్న మ్యాచ్ లో ఆడిన ఇన్నింగ్స్ అందరినీ ఆశ్చర్యపరిచింది. వెస్టిండీస్ విసిరిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వికెట్లు పడుతున్నా సంజు ఏమాత్రం బెదరకుండా ఆఖరి వరకు నిలబడి మ్యాచ్ ను ముగించారు. ఈ విజయం తర్వాత సంజు తన మనసులోని మాటలను పంచుకుంటూ, కష్టకాలంలో తాను తీసుకున్న నిర్ణయాలు ఈరోజు ఫలితాన్ని ఇచ్చాయని చెప్పారు. ఆ ఆసక్తికరమైన విశేషాలు ఇప్పుడు వివరంగా చూద్దాం.

సోషల్ మీడియాకు దూరం..

వెస్టిండీస్ పై మ్యాచ్ గెలిచిన తర్వాత సంజు శాంసన్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా తనపై వస్తున్న విమర్శలను ఏమాత్రం పట్టించుకోలేదని చెప్పారు. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న సమయంలో సెల్ఫ్ బిలీఫ్ కోల్పోకుండా ఉండటానికి తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. "ఎవరో చెప్పే మాటలు వినడం కంటే, నా అంతరాత్మ చెప్పే మాటలు వినాలని నిర్ణయించుకున్నాను" అని సంజు పేర్కొన్నారు. తన టెక్నిక్ లో చిన్న మార్పులు చేసుకుంటూ, తన బేస్ పై వర్క్ చేయడం వల్లే ఈ కీలక మ్యాచ్ లో రాణించగలిగానని వివరించారు. విమర్శలు వస్తున్నప్పుడు బయటి ప్రపంచం కంటే మన మనసు చెప్పే మాటే బలమైనదని సంజు ఈ ఇన్నింగ్స్ తో నిరూపించారు. ఒంటరి పోరాటం.. వికెట్లు పడుతున్నా చెదరని గురి ఈ మ్యాచ్ లో 196 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ తడబడింది. సూర్యకుమార్ యాదవ్ (18), తిలక్ వర్మ (27) కొంత సహకారం అందించినప్పటికీ, వికెట్లు వరుసగా పడటంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే ఓపెనర్ గా వచ్చిన సంజు శాంసన్ మాత్రం ఒకవైపు పట్టుదలతో బ్యాటింగ్ చేస్తూ 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచారు. ఈడెన్ గార్డెన్స్ లో మంచు కురిసే సమయంలో బ్యాటింగ్ సులభం అవుతుందని అనుకున్నామని, కానీ వికెట్లు పడటం వల్ల ఛేజింగ్ కష్టమైందని సంజు అంగీకరించారు. తన అనుభవాన్ని రంగరించి జట్టును గెలిపించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. 10 రోజుల విరామం ఇచ్చిన బలం వెస్టిండీస్ మ్యాచ్ కంటే ముందు తన ఫామ్ పై వస్తున్న విమర్శలను సంజు చాలా లోతుగా ఆలోచించారు. న్యూజిలాండ్ సిరీస్ లో విఫలమైనప్పుడు వరల్డ్ కప్ జట్టులో ఉండాలనే తన కోరిక నెరవేరుతుందో లేదో అని భయపడ్డట్లు ఆయన తెలిపారు. అయితే ఆ తర్వాత దొరికిన 10 రోజుల విరామంలో ఎక్కడా మ్యాచులు ఆడకుండా తన టెక్నిక్ లో ఉన్న లోపాలను సరిదిద్దుకున్నట్లు వెల్లడించారు. "సంజు.. ఇంకేం కావాలి? ఎందుకు ఇది వర్కవుట్ అవ్వడం లేదు?" అని తనలో తాను ప్రశ్నించుకున్నానని, ఆ ఆత్మశోధనే తన బేస్ ను మార్చుకోవడానికి ఉపయోగపడిందని చెప్పారు. మూడు అంతర్జాతీయ సెంచరీలు చేసిన పాత సెటప్ తోనే మళ్ళీ నిలబడతానని తనపై తాను నమ్మకం ఉంచుకున్నారు. ఈరోజు అది నిజమైంది తన కెరీర్ లో ఈ ఇన్నింగ్స్ ఎంతో ప్రత్యేకమైనదని సంజు శాంసన్ ఎమోషనల్ అయ్యారు. దేశంలో కోట్లాది మంది క్రికెటర్లు ఇలాంటి ఒక రోజు కోసం కలలు కంటారని, తాను కూడా చిన్నప్పుడు తిరువనంతపురంలో ఉన్నప్పుడు ఇలాంటి మ్యాచులు గెలవాలని అనుకున్నానని చెప్పారు. "నేను ఆ కలను కనడానికి ధైర్యం చేశాను, ఈరోజు అది నిజమైంది" అని సంజు గర్వంగా చెప్పుకొచ్చారు. నెగిటివ్ ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని పాజిటివ్ గా మార్చుకోవడం నేర్చుకున్నానని, ఆ మార్పు వల్లే ఈరోజు భారత్ ను సెమీస్ కు చేర్చే ఇన్నింగ్స్ ఆడగలిగానని సంతోషం వ్యక్తం చేశారు. కేరళ నుంచి వచ్చి దేశాన్ని గెలిపించడం ఒక గొప్ప అనుభూతిని ఇస్తోందని అన్నారు. ఒత్తిడిలో షాట్ సెలక్షన్.. అనుభవం నేర్పిన పాఠం భారీ లక్ష్య ఛేదనలో రిస్క్ తీసుకోకుండా బౌండరీలపై దృష్టి పెట్టానని సంజు శాంసన్ వివరించారు. వికెట్లు పడుతున్న సమయంలో మ్యాచ్ ను ఆఖరి వరకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. "సాధారణంగా ఇలా చేయాలని అనుకుంటాం కానీ ప్రతిసారీ అది సాధ్యం కాదు, ఈసారి కుదిరినందుకు కృతజ్ఞతతో ఉన్నాను" అని సంజు చెప్పారు. జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ల సంఖ్య పెరగడం వల్ల దక్షిణాఫ్రికా మ్యాచ్ తర్వాత తనను ఓపెనర్ గా పంపించారని, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం సంతృప్తిని ఇచ్చిందని వెల్లడించారు. జట్టు అవసరాలకు తగ్గట్టుగా తన బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం తన బాధ్యతగా భావించానని సంజు వివరించారు. సెమీస్ పోరుకు సిద్ధం.. వెస్టిండీస్ పై సాధించిన ఈ విజయంతో భారత్ అధికారికంగా సెమీ ఫైనల్ కు చేరుకుంది. గ్రూప్ 1 లో కీలక మ్యాచులు గెలిచి టాప్ లో నిలిచిన భారత్, ఇప్పుడు సెమీస్ లో ఇంగ్లాండ్ ను ఎదుర్కోబోతోంది. ఈ కీలక పోరు మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుంది. సంజు శాంసన్ ఫామ్ లోకి రావడం టీమ్ ఇండియాకు పెద్ద ప్లస్ పాయింట్ అని చెప్పవచ్చు. ఒత్తిడి ఉండే ఇలాంటి మ్యాచుల్లో సంజు వంటి ఆటగాళ్లు రాణించడం జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. చాలా మంది నుంచి తనకు సూచనలు వచ్చాయని, అందులో కొన్ని మంచి పాయింట్లు ఉన్నా తన సహజమైన శైలిని మాత్రం వదులుకోలేదని సంజు స్పష్టం చేశారు. తనపై తాను ఉంచుకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది అని ఆయన నమ్ముతున్నారు. ఈ ఇన్నింగ్స్ ఇచ్చిన ఊపుతో సెమీస్ లో కూడా రాణించి దేశానికి వరల్డ్ కప్ అందించాలనే పట్టుదలతో సంజు ఉన్నారు. తన టెక్నిక్ సెటప్ లో అతిగా మార్పులు చేయకుండా కేవలం మానసికంగా బలంగా ఉండడం వల్ల ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. ఏదేమైనా సంజు శాంసన్ లోని ఈ విశ్వాసం రాబోయే కీలక మ్యాచుల్లో టీమ్ ఇండియాకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఇక నెక్స్ట్ మ్యాచ్ లో ఎలాంటి ఆటను చూపిస్తాడో చూడాలి.

## దుద్దిల్లా శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా ఘన నివాళులు..



ఓదెల//మార్చి02(ఆకాంక్ష) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 89వ జయంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూరు రైల్వే గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కొవ్వొత్తులు వెలిగించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈసందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, శ్రీపాదరావు తన జీవితాంతం ప్రజాసేవకే అంకితమై పనిచేసిన మహానేత అని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యులై సేవలందించిన నాయకుడిగా ఆయన నిలిచారని కొనియాడారు. సాధారణ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రజల మధ్యే జీవించి, ప్రజాసేవలోనే తన జీవితాన్ని గడిపిన మహానేతగా శ్రీపాదరావును స్మరించుకుంటూ పలువురు నాయకులు భావోద్వేగంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గాజుల శివశంకర్, సాతూరి రాజేశం, కందుల అశోక్ పటేల్, కర్క మోహన్ రెడ్డి, బండారి చంద్రయ్య పటేల్, వేల్పుల కృష్ణస్వామి యాదవ్, కాసారపు నాగేంద్రబాబు, మాడిశెట్టి శంకరయ్య, జిగురు రాజేందర్, మాటూరి ఎల్లయ్య, జెట్టి కుమార్, దరిపెల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో ఆసుపత్రి సిబ్బందికి 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డులు...




పెద్దపల్లిటౌన్//మార్చి02(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రతినెలా ప్రదానం చేస్తున్న 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డులను సోమవారం ఘనంగా అందజేశారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అమలు చేస్తున్న ఈ ప్రోత్సాహక కార్యక్రమంలో భాగంగా మార్చి నెలకు గాను ఇద్దరు సిబ్బందిని ఎంపిక చేసి సత్కరించారు. ఆసుపత్రిలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ, రోగులకు సేవలందించడంలో విశేష ప్రతిభ కనబరిచిన ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ శ్రీమతి ఎన్. మాధవి మరియు శానిటేషన్ స్వీపర్ శ్రీమతి బి. విజయలను ఈ నెల 'స్టార్ పెర్ఫార్మర్' అవార్డులకు ఎంపిక చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ చేతుల మీదుగా వారికి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డా. కె. శ్రీధర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కింది స్థాయి సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని, ఉత్తమ పనితీరు కనబరిచే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవార్డులు ఇతర సిబ్బందిలో కూడా ఉత్సాహాన్ని పెంచి సేవా భావాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డా. విజయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి జమునతో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసీసీ శిక్షణ తరగతులు ఘనంగా ముగింపు...




నాగర్ కర్నూల్ టౌన్//మార్చి02(ఆకాంక్ష) : వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన ఏఐసీసీ శిక్షణ తరగతులు ఘనంగా ముగిశాయి. గత నెల ఫిబ్రవరి చివరి వారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమం ఆనందగిరి తెలంగాణ టూరిజం కేంద్రంలో వైభవంగా జరిగింది. మార్చి 2వ తేదీన ఈ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఏఐసీసీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా డాక్టర్ చల్లా వంశీ చందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తకాపు శివసేనారెడ్డి స్పోర్ట్స్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ట్రైనర్లు చెరుకుబొట్టు శీను, సంజయ్ రెడ్డి, డాక్టర్ రమేష్, ప్రకాష్, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దె మల్లేష్, మహమ్మద్ ఇక్బాల్ అలీ తదితర వివిధ జిల్లాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పార్టీని గ్రామ స్థాయిలో పటిష్టపరచడం, ప్రతి కార్యకర్త సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు మార్గదర్శకత్వం ఇవ్వడం అని నాయకులు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణ ప్రణాళికలు, ప్రజలతో మమేకమయ్యే విధానాలపై విస్తృత చర్చలు జరిగాయి. నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి, సంఘటితంగా పనిచేసే విధానం, ఎన్నికల వ్యూహాలపై కూడా మార్గనిర్దేశం అందించారు. ఈ శిబిరం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగి, గ్రామ గ్రామాన ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చురుకుదనం వస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## విజయ్ దేవరకొండరష్మిక మందానకు

## కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతుల శుభాకాంక్షలు...





నాగర్ కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) :ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు సోమవారం బల్మూరు మండలం తుమ్మన్‌పేట గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు నూతన దంపతులకు జ్ఞాపికను అందజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. గ్రామంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. స్థానిక ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సినీ దంపతులను ప్రత్యక్షంగా చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ, సినీ రంగంలో విశేష ఖ్యాతి గడించిన ఈ జంటకు ప్రజల ప్రేమ, ఆదరణ ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. సినీ నటి, నటులు కూడా ప్రజల అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, తమపై చూపుతున్న ప్రేమకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి అభివృద్ధి కోసం సహకరించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి..

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...




నాగర్ కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) :నాగర్ కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, సాగునీటి శాఖల అధికారులతో కలిసి భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. జిల్లాలో అమలులో ఉన్న ప్రాధాన్య ప్రాజెక్టులు అయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, అలాగే అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, న్యాయబద్ధంగా భూసేకరణ ప్రక్రియ కొనసాగించాలని ఆయన సూచించారు. భూ యజమానులతో సమన్వయం చేసుకుని, వారికి చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ కేసులు, వివాదాలు, సర్వే ప్రక్రియలు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దశలో సమన్వయం పెంచుకుని నిర్ణీత గడువులో పనులు ముగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైతే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు తమ బాధ్యతలను గుర్తుంచుకుని ప్రభుత్వ లక్ష్యాల సాధనలో చురుకుగా పనిచేయాలని, ప్రతి వారమూ పురోగతిపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, రెవెన్యూ మరియు సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు.




## నాగర్ కర్నూల్ జిల్లాలో అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ విజేతకు సన్మానం...



నాగర్ కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని దేవులతండాకు చెందిన సభావాత్ బాబు నాయక్ అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం సాధించి జిల్లాకు గౌరవం తీసుకువచ్చారు. ఇండోనేషియా దేశంలోని బాలిలో ఫిబ్రవరి 14 నుండి 19 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రతిభను గుర్తిస్తూ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఐఏఎస్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వి. సీతారాం, శాఖ సిబ్బంది పాల్గొని విజేతను అభినందించారు.

## బీసీలకు రక్షణ కరువు.. వెంటనే చట్టం తేవాలి..!

### పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ డిమాండ్...




పెద్దపల్లిటౌన్//మార్చి 02 (ఆకాంక్ష): రాష్ట్రంలో బీసీలపై రోజురోజుకు పెరుగుతున్న దాడులు, సామాజిక వివక్షను అరికట్టేందుకు తక్షణమే ప్రత్యేక 'బీసీ రక్షణ చట్టం'ను తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన బీసీల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇటీవలి కాలంలో బీసీలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలు, సామాజిక బహిష్కరణలు, వేధింపులు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. నల్గొండ, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో జరిగిన దాడులు, సామాజిక ఉద్రిక్తతల సంఘటనలు ఇంకా ప్రజల మదిలో తాజాగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కఠినమైన చట్టపరమైన రక్షణ అవసరమని అన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్న విధంగా తెలంగాణలో కూడా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కొండి సతీష్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న అట్రాసిటీ చట్టం తరహాలోనే బీసీలకు కూడా సమానమైన రక్షణ కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. బీసీలపై జరుగుతున్న సామాజిక దాడులు, హత్యలు, వేధింపులు, బహిష్కరణలు వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో బీసీ అభ్యర్థులపై జరుగుతున్న బెదిరింపులు, కిడ్నాప్‌లు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. ఇటువంటి రాజకీయ అణచివేతలు కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. కుమ్మర మల్లన్న జాతరలో చోటుచేసుకున్న పసికందు హత్య వంటి ఘటనలు బీసీల భద్రతా లోపానికి స్పష్టమైన ఉదాహరణలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురాకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ప్రారంభించాల్సి వస్తుందని కొండి సతీష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీలకు న్యాయం జరగాలంటే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.

### పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా మాజీ స్పీకర్ దుద్దిళ్ల

## శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు.



పెద్దపల్లి,మార్చి02(ఆకాంక్ష) :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు పెద్దపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద, అలాగే సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలు మరువలేనివని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన దిశానిర్దేశం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, మార్కెట్ చైర్మన్ మినిపాల ప్రకాష్ రావు, కూర మల్లారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక సతీష్, భూషణవ్ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరై శ్రీపాదరావుకు ఘనంగా నివాళులర్పించారు.

### నాగర్ కర్నూల్ జిల్లా మామిళ్ళపల్లిలో

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం...

నాగర్ కర్నూల్ టౌన్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట తాలూకా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల సరిత రాజేష్ రెడ్డి దంపతులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించిన ఎమ్మెల్యే దంపతులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు, భక్తులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధి, సౌకర్యాల విస్తరణకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### "పాత జ్ఞాపకాల పల్లకిలో 50 ఏళ్ల తర్వాత

## మళ్లీ కలిసి నడిచిన మిత్రులు.

### నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు...



నాగర్‌కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 197476 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఐదు దశాబ్దాల తర్వాత ఒకేచోట చేరి హృద్యమైన గెట్‌టుగెదర్ నిర్వహించారు. 50 సంవత్సరాల విరామం తర్వాత మిత్రులు మళ్లీ కలుసుకోవడంతో కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఆ కాలంలో చదువుకున్న రోజులు, తరగతి గదులలో గడిపిన క్షణాలు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాలు, స్నేహితులతో పంచుకున్న జ్ఞాపకాలు ఒక్కొక్కటిగా గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. చాలా కాలం తర్వాత ఎదురెదురుగా చూసుకోవడంతో కొందరు ఆనందబాష్పాలు కూడా పెట్టుకున్నారు. 197476 బ్యాచ్‌లో దాదాపు 120 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 30 మంది మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడి జీవనం సాగిస్తున్న మిగిలిన సహచరులను కూడా సంప్రదించి మరిన్ని వివరాలు సేకరించేందుకు ప్రయత్నాలు చేయాలని నిర్ణయించారు. రాబోయే రెండేళ్లలో అన్ని పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పెద్ద స్థాయిలో రీయూనియన్ సమావేశం నిర్వహించాలని వారు సంకల్పించారు. ఈ సందర్భంగా పరస్పరం తమ కుటుంబ పరిస్థితులు, వృత్తి అనుభవాలు పంచుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలపరుచుకున్నారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహానికి నిదర్శనంగా నిలిచింది. వారి అనుబంధం కాలాన్ని దాటి కొనసాగుతుందనే విషయాన్ని మరోసారి ఈ గెట్‌టుగెదర్ స్పష్టంచేసింది.

## నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సహజ రంగులతో హోలీ వేడుకలు...

### ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ...




నాగర్‌కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, నాల్గవ వార్డు కౌన్సిలర్ వసంత ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వసంత మాట్లాడుతూ, హోలీ పండుగను సహజ సిద్ధమైన రంగులతోనే జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రకృతిని మనం కాపాడితేనే ప్రకృతి మనలను కాపాడుతుందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ప్లాస్టిక్, రసాయన రంగులు పర్యావరణానికి హానికరమని, సహజ వనరులను వినియోగించడం ద్వారా మన ఆరోగ్యాన్ని, ప్రకృతిని కాపాడవచ్చని వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మదన్‌మోహన్ మాట్లాడుతూ, మార్కెట్లో లభించే రసాయన రంగులు చర్మవ్యాధులు, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సహజ పదార్థాలతో తయారు చేసిన రంగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎకో క్లబ్ నిర్వహిస్తున్న పర్యావరణ అవగాహన కార్యక్రమాలను ఆయన వివరించారు. తదుపరి సహజ రంగులతో కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఒకరికి ఒకరు సహజ రంగులు రాసుకుంటూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, దశరథం, శోభారాణి, కాంగ్రెస్ నాయకులు సంతోష్ గౌడ్, నాని గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా హెల్ప్ డెస్క్ ద్వారా మాతా సంరక్షణ సేవలు మెరుగుపరచాలి...



నాగర్ కర్నూల్//మార్చి02(ఆకాంక్ష) :నాగర్ కర్నూల్ జిల్లాలో గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు జిల్లా హెల్ప్ డెస్క్ సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని మాతా సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏ. లక్ష్మణ్ సూచించారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న జిల్లా హెల్ప్ డెస్క్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, నిర్వహణపై సమీక్షించారు. హెల్ప్ డెస్క్ ద్వారా నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించిన డాక్టర్ లక్ష్మణ్, జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి గర్భిణీలు ఆరోగ్య పరీక్షలు, ప్రసవ సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేలా ప్రోత్సహించాలని సిబ్బందికి ఆదేశించారు. గర్భిణీలు ఇంటి నుంచి ఆసుపత్రికి రావడానికి 102 అంబులెన్స్ ఉచిత రవాణా సేవలను వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవల ద్వారా వెంటనే ఆసుపత్రికి చేరుకునే విధంగా ప్రతి గర్భిణీకి సమాచారం అందించాలని తెలిపారు. ప్రసవానంతరం బాలింతలు తమ ఇళ్లకు సురక్షితంగా చేరుకునేందుకు 102 అంబులెన్స్ సేవలను ఉపయోగించి వాహన సదుపాయం కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి గర్భిణీకి స్త్రీ వైద్య నిపుణులచే సమగ్ర ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వైద్య సూచనలు అందించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి గర్భిణీకి మూడో, నాలుగో దశ ఆరోగ్య పరీక్షలు గైనకాలజిస్టులచే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ సేవల ద్వారా మూత్రం, రక్త పరీక్షలు సహా అన్ని పరీక్షలను ఉచితంగా అందించేలా హెల్ప్ డెస్క్ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలకు జిల్లా హెల్ప్ డెస్క్ మరింత ఉపయోగకరంగా మారేలా సేవలను విస్తరించాలని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాజగోపాల చారి, నరసింహ, డిప్యూటీ పారామెడికల్ అధికారి సుకుమార్ రెడ్డి, ఆరోగ్య విస్తీర్ణ అధికారి నిరంజన్, జిల్లా హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి. యాదగిరి, సూపర్వైజర్ కే. గంగా తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగించిన మంథని పోలీస్....




మంథని రూరల్//మార్చి02(ఆకాంక్ష) :మంథని పరిసర ప్రాంతాలకు చెందిన బాధితులు గత నెల రోజుల క్రితం మంథనిలో ఫోన్ ను పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అప్పగించిన మంథని పోలీసు సిబ్బంది. బాధితులు గత నెల రోజుల క్రితం మంథనిలో ఫోన్ ను పోగొట్టుకోవడంతో వారు దాన్ని పోర్టల్ లో అప్లికేషన్ చేసుకోగా అట్టి ఫోన్ ఆచూకీ కనుగొని బాధితులకు అప్పగించడం జరిగిందని, ఎవరైనా ఫోను పోగొట్టుకున్నట్లయితే దాన్ని పోర్టల్ లో అప్లై చేసుకుని అట్టి రిసిప్ట్ మాకు అప్పగించగలరని, ఎవరైనా పోగొట్టుకున్న ఫోన్ ఎవరికైనా దొరికినట్లైతే దాన్ని పోలీస్ స్టేషన్లో అప్పగించగలరు మంథని ఎస్సై ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఆకుతోటపల్లి గ్రామంలో 102 ఏళ్ల చర్చ్ శతాబ్దోత్సవ వేడుకలు...



నాగర్ కర్నూల్/కల్వకుర్తి, మార్చి02(ఆకాంక్ష) :నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం ఆకుతోటపల్లి గ్రామంలో చారిత్రాత్మకంగా నిలిచిన ప్రసిద్ధ చర్చ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం వైభవంగా శతాబ్దోత్సవ వేడుకలు నిర్వహించారు. శతాబ్దానికి పైగా విశ్వాస సేవలో నిలిచిన ఈ చర్చ్ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక జీవనంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. చర్చ్ సమాజ సేవ, విద్యా, సామాజిక కార్యక్రమాల్లో చేసిన సేవలను ఆయన ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డితో కలిసి చర్చ్ అదనపు గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ అదనపు గది నిర్మాణం ద్వారా విశ్వాసులకు మరింత సౌకర్యం కలుగుతుందని, భక్తుల అవసరాలకు అనుగుణంగా చర్చ్ విస్తరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రార్థనలు, ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చర్చ్ సేవలను స్మరించుకుంటూ కృతజ్ఞతా సభ నిర్వహించారు. 102 సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొని చర్చ్ అభివృద్ధికి సహకరించాలని సంకల్పించారు. ఈ శతాబ్దోత్సవ వేడుక ఆకుతోటపల్లి గ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ సందర్భంగా నిలిచింది.



## తాటి వనాల్లో ప్లాస్టిక్‌కు చెక్ గీత కార్మికులకు కుండల పంపిణీ...



చిగురుమామిడి//**మార్చి02(ఆకాంక్ష)** : గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ముదిమాణిక్యం సర్పంచ్ బోయిని రమేష్ స్పష్టం చేశారు. తాటి వనాల్లో గీత కార్మికులు ప్లాస్టిక్ బాటిళ్లు వాడితే కఠినంగా జరిమానా విధించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. తాటి చెట్లకు ప్లాస్టిక్ బాటిళ్లు కట్టడం పూర్తిగా నిషేధించామని, అలాంటి చర్యలు చేపడితే రూ.5 వేల జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ బాటిళ్లు సూర్యరశ్మికి వేడై మైక్రో ప్లాస్టిక్ విడుదలవుతాయని, దీని వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగానికి బదులుగా సంప్రదాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ సర్పంచ్ రమేష్ స్వంత ఖర్చులతో 22 మంది గౌడ కులస్తులకు ఒక్కొక్కరికి ఐదు చొప్పున కల్లు కుండలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ చర్యకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కల్పించారు. గ్రామ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూదరి పరుశురాం గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు ముంజ వెంకన్న, కార్యదర్శి మధుసూదన్, గౌడ కులస్తులు లింగన్న, వెంకన్న, రమేష్, వీరస్వామి, లచ్చయ్య, మహేందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద హరిజనవాడ గ్రామం నుంచి
## భక్తుల పవిత్ర పాదయాత్ర ప్రారంభం..



కొత్తగూడెం// **మార్చి02(ఆకాంక్ష)** : భక్తి భావంతో, సంప్రదాయ నిష్ఠలతో పెద్ద హరిజనవాడ గ్రామస్తులు సోమవారం ఉదయం పవిత్ర పాదయాత్రను ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన భక్తులు రామనామ స్మరణలతో భద్రాచలం వైపు తమ యాత్రను ఆరంభించారు. ఈ యాత్రలో భాగంగా భక్తులు నెల రోజుల పాటు కఠిన నియమాలు పాటిస్తూ సిద్ధం చేసిన 'వలసిన గోటి తలంబ్రాలను' భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సమర్పించనున్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. నారింజ, పసుపు రంగుల సంప్రదాయ దుస్తులు ధరించిన భక్తులు చేతుల్లో నారింజ రంగు జెండాలతో రామనామ ధ్వనులతో గ్రామ వీధుల్లో ఊరేగింపుగా బయల్దేరారు. గ్రామస్తులు చేతితో వలిచిన బియ్యంతో తయారు చేసిన తలంబ్రాలను అత్యంత పవిత్రంగా భావిస్తూ వాటి సిద్ధీకరణలో నెల రోజుల పాటు ఉపవాసాలు, నియమ నిష్ఠలతో కృషి చేశారు. ఈ తలంబ్రాలను భగవంతునికి సమర్పించడం తమ కుటుంబాలకు, గ్రామానికి శ్రేయస్సు కలిగిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి, యాత్రికులకు ఆశీస్సులు అందజేశారు. యాత్రకు బయల్దేరిన భక్తులను గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలుకుతూ వారి విజయవంతమైన యాత్ర కోసం ప్రార్థనలు చేశారు. పెద్ద హరిజనవాడ నుండి భద్రాచలం వరకు సాగే ఈ సుదీర్ఘ పాదయాత్ర గ్రామ ప్రజల గాఢమైన భక్తి, సంప్రదాయాల పట్ల గౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది. భగవంతుని అనుగ్రహంతో పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసి, సీతారాముల దర్శనం, తలంబ్రాల సమర్పణ సజావుగా సాగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

## హైదరాబాద్ ఎల్బీనగర్‌లో కారు బీభత్సం...
### బైరమల్‌గూడ ఫ్లైఓవర్‌పై అతివేగం ప్రమాదానికి కారణం...



హైదరాబాద్//**మార్చి02(ఆకాంక్ష)** : నగరంలోని ఎల్బీనగర్ పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. బైరమల్‌గూడ ఫ్లైఓవర్‌పై అతివేగంతో దూసుకొచ్చిన ఓ కారు ముందు వెళ్తున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగం తీవ్రంగా ఉండటంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఫైరింజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అతన్ని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడం ఉపశమనం కలిగించింది. పోలీసుల ప్రాథమిక విచారణలో, ప్రమాద సమయంలో కారులో ఉన్నవారంతా మద్యం మత్తులో ఉన్నట్లు వెల్లడైంది. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనతో ఫ్లైఓవర్‌పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు తక్షణమే పరిస్థితిని నియంత్రించి రాకపోకలను పునరుద్ధరించారు.

## రేపు చిలుకూరు బాలాజీ ఆలయం మూసివేత...



రంగారెడ్డి//**మార్చి02(ఆకాంక్ష)** : రేపు సంభవించనున్న చంద్ర గ్రహణం నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మోకిల సమీపంలోని ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ ఆలయంను తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. గ్రహణ కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిత్య కార్యక్రమాల్లో మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ఉదయం 7 గంటల 30 నిమిషాల వరకు మాత్రమే స్వామివారి నిత్య సేవలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ద్వారాలను మూసివేసి భక్తులకు ప్రవేశాన్ని నిలిపివేస్తారని వివరించారు. సాయంత్రం 7 గంటలకు ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తామని, అయితే ఆ సమయానికి భక్తులకు స్వామివారి దర్శనం ఉండదని స్పష్టం చేశారు. గ్రహణం ముగిసిన అనంతరం బుధవారం ఉదయం 6 గంటల నుంచి తిరిగి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గ్రహణ కాలంలో ఆలయ నియమాలను పాటించి సహకరించాలని భక్తులను వారు కోరారు.

## బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్ విద్యార్థులకు
## బోధనకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం..




వరంగల్//**మార్చి02(ఆకాంక్ష)** : వరంగల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అగ్రికల్చర్ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్ విద్యార్థులకు బోధించేందుకు ఒక పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే అగ్రికల్చర్ మహిళా గురుకులం కళాశాల డీన్ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీన్ నర్సింహారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, అభ్యర్థులు పీహెచ్‌డీ, ఎంఎస్సీ అగ్రికల్చర్, ఎంటెక్ అగ్రికల్చర్ విద్యార్హతలు కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 9వ తేదీన తమ విద్యార్హతల ధృవీకరణ పత్రాలతో తిమ్మాపూర్‌లోని గురుకుల కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7680964654 నంబర్‌ను సంప్రదించవచ్చని డీన్ తెలిపారు.

# గట్టుప్పల్ మండలంలో చేనేతలపై ప్రభుత్వం నిర్లక్ష్యం....

### బీఆర్ఎస్ మండల కన్వీనర్
### ఇడం కైలాసం ఆగ్రహం...



యాదాద్రి//**మార్చి02(ఆకాంక్ష)** : యాదాద్రి భువనగిరి జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన చేనేత కార్మికుల సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడం కైలాసం ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చేనేతల కోసం రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల అనంతరం ఆ హామీని రూ.లక్షకు కుదించి చేనేతల పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆయన ఆరోపించారు. చేనేత కార్మికులు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారికి తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఇచ్చిన రూ.లక్ష రుణమాఫీ కూడా పట్టణ ప్రాంతాలకే పరిమితం చేసి గ్రామీణ ప్రాంత చేనేత కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని కైలాసం మండిపడ్డారు. గ్రామాల్లో పనిచేస్తున్న మగ్గం కార్మికులు కూడా సమానంగా ఈ పథకానికి అర్హులేనని, వారిని పక్కన పెట్టడం అన్యాయమని ఆయన స్పష్టం చేశారు. తక్షణమే గ్రామీణ చేనేత కార్మికులందరికీ రుణ మాఫీ వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా చేనేత భరోసా, త్రిఫ్ట్ ఫండ్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ నిధులు విడుదల కాకపోవడంతో చేనేత కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని, మగ్గాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయకపోతే ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. ఇందులో భాగంగా త్వరలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి చేనేతల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా సమావేశం అనంతరం చేనేత మగ్గాలను పరిశీలించిన కైలాసం, కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. మగ్గాలకు అవసరమైన ముడిసరుకు, మార్కెట్ సదుపాయాలు, రుణ సౌకర్యాలు లేకపోవడం వల్ల చేనేత రంగం క్షీణిస్తున్నదని కార్మికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారం కోసం కృషి చేస్తామని కైలాసం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు గంజి పెద్దలు, బడుగు తిమ్మయ్య, నామని గణేశ, రవ్వ రాములు, సూరేపల్లి బుచ్చయ్య, పులిపాటి వెంకటేశం, పెదగాని రాములు, చెరిపల్లి రమేశ్, గుర్రం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి బొమ్మిడి భద్రయ్య మృతి
## కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు...



తిమ్మాపూర్//**మార్చి02(ఆకాంక్ష)** : తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మాజీ నాయకుడు బొమ్మిడి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఆయన మృతి పట్ల విశ్రాంత ఉద్యోగులు, సహచరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్వగృహాన్ని సందర్శించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు భద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, మండల అధ్యక్షుడు వంగపల్లి నారాయణ, మండల గౌరవ అధ్యక్షుడు శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి శిలుముల వెంకటేశ్వర్లు, అసోసియేషన్ ప్రెసిడెంట్ మామిడాల సిద్దయ్య తదితరులు పాల్గొని భద్రయ్య చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీ నారాయణ రెడ్డి, కే ప్రకాష్, బండి కుమార్, బండి మొగిలి, ఎన్ కొండయ్య, బుర్ర మల్లయ్య, కే పోషయ్య, వై రాజయ్య, పీ మల్లయ్య, చెంచు రామయ్య, డీ గంగారాం, ఎన్ మల్లయ్య, ఆర్ నారాయణతో పాటు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. భద్రయ్య సేవలను స్మరించుకుంటూ నాయకులు ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## ప్రియదర్శిని ఇంజనీరింగ్ విద్యార్థినులకు భారీ ప్లేస్‌మెంట్లు...




ఖమ్మం//**మార్చి02(ఆకాంక్ష)** : ఖమ్మం రూరల్ జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థినులు ప్రముఖ బహుళజాతి సంస్థ పెంటగాన్ టెక్నాలజీస్, బెంగళూరులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ఇంజనీర్లుగా వార్షిక రూ.6 లక్షల వేతనంతో ఉద్యోగ నియామకాలు పొందడం గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఎంపికైన విద్యార్థినులను ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలపై దృష్టి సారించడం, సమర్థవంతమైన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ కలగలిపిన ఫలితమే ఈ విజయమని తెలిపారు. ప్రస్తుత కాలంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్ మాట్లాడుతూ, బలమైన అకడమిక్ పునాది, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణా విధానం, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థులను సమర్థవంతంగా ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సిద్ధాంత విజ్ఞానాన్ని ప్రాయోగిక నైపుణ్యాలతో సమన్వయం చేస్తూ అందిస్తున్న శిక్షణ ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. ఇది విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, కళాశాల అందిస్తున్న నాణ్యమైన అకడమిక్ టెక్నికల్ శిక్షణ సమిష్టి ఫలితమని చెప్పారు. అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ కళాశాలలో అమలు చేస్తున్న బలమైన అకడమిక్ ప్రణాళిక, ఫలితాలపై దృష్టి సారించిన బోధనా విధానం, నిరంతర శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించాయని వివరించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తివారి మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థినులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాలనీల అభ్యున్నతికి తనవంతు పూర్తి సహకారం అందిస్తా...
### మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హామీ...



మల్కాజిగిరి//**మార్చి02(ఆకాంక్ష)** : కాలనీల అభ్యున్నతికి తనవంతు పూర్తి సహకారం అందిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పలు కాలనీలకు చెందిన ప్రతినిధులు ఆయనను కలుసుకుని తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రజలు వినతిపత్రాలు సమర్పించి, తమ కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఏడు కాలనీలలో డ్రైనేజీ ట్రంక్ లైన్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రతినిధులు వివరించారు. వినాయక్‌నగర్ డివిజన్‌లో వెంకటేశ్వరనగర్ కాలనీలో డ్రైనేజీ పైపులైన్ల సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని సత్య రాఘవేంద్రకాలనీ, లంబాడిబస్తీలో విద్యుత్ దీపాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆర్‌యూబీ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, వెంకటాపురం ఖానాజీగూడలో విద్యుత్ సరఫరా లోపాలు, సీసీ రోడ్ల కొరత వంటి అంశాలు కూడా ఎమ్మెల్యేకు వివరించారు. నేరేడ్‌మెట్‌లోని ఓల్డ్ పీఎస్ ప్రాంతంలో పోలీసు బందోబస్తు పెంచాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమస్యల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పరిష్కార చర్యలు చేపడతామని చెప్పారు. కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, సమస్యలు తక్షణమే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో కాలనీలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బేగంపేట గ్రామంలో కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రారంభం...



సిద్దిపేట//**మార్చి02(ఆకాంక్ష)** : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో భద్రతా పరిరక్షణను బలోపేతం చేసే దిశగా ఏర్పాటు చేసిన నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ టౌన్ సీఐ రవి కుమార్, బేగంపేట ఎస్ఐ డి. మహిపాల్ రెడ్డి, విపిఓ బి. ప్రేమరాజ్, ఏఎస్ఐలు హాజరై సీసీ కెమెరాలను ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ మద్దా గీతా ప్రవీణ్, ఉప సర్పంచ్ మంకిడి స్వామి, వార్డు సభ్యులు, దాతలు, గ్రామ ప్రజల సమక్షంలో కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామంలో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయడం, చోరీలు మరియు ఇతర అనైతిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడం సులభమవుతుందని, ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. బేగంపేట గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని అభినందించారు. రాయపోల్ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాలు ఉంటే నేరాలు జరగకుండా నిరోధించవచ్చని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా భద్రతా చర్యలకు సహకరించాలని, గ్రామాన్ని సురక్షితంగా మార్చేందుకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని అధికారులు కోరారు.

## వికారాబాద్ జిల్లా నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం....
### శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలో 30కిపైగా ఉద్యోగాలు...
### మార్చి 5న జాబ్ మేళా...




వికారాబాద్//**మార్చి02(ఆకాంక్ష)** : జిల్లా నిరుద్యోగ యువతకు మరో మంచి ఉపాధి అవకాశాన్ని అందిస్తూ జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ కీలక ప్రకటన చేశారు. శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాల భర్తీకి వికారాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా మార్చి 5వ తేదీ గురువారం ఉదయం 10:30 గంటలకు వికారాబాద్ ఐటిఐ క్యాంపస్‌లో జరుగుతుందని వెల్లడించారు. శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్ వంటి పోస్టులకు సుమారు 30కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోనే నేరుగా ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, బి.టెక్, ఎంబీఏ వంటి విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఇంటర్వ్యూలలో పాల్గొని తక్షణమే ఉద్యోగాన్ని పొందే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి ఉద్యోగాన్ని సాధించేందుకు ముందుకు రావాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇతర వివరాల కోసం జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్‌ను 9676047444 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో భాగంగా ఇలాంటి జాబ్ మేళాలను తరచూ నిర్వహిస్తున్నామని, యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అధికారులు సూచించారు.

## మంచిర్యాల జిల్లా కోర్టులో బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై ఉత్కంఠ
### కస్టడీ అప్పీల్‌పై విచారణ వాయిదా...



మంచిర్యాల//**మార్చి02(ఆకాంక్ష)** : అక్రమ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులు జిల్లా కోర్టులో అప్పీల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై జిల్లా కోర్టు సోమవారం విచారణ జరిపి, తదుపరి విచారణను ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇదే సమయంలో బాల్క సుమన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై లంచ్ అనంతరం జిల్లా కోర్టు తీర్పు వెల్లడించనున్నట్లు సమాచారం. అయితే కస్టడీ పిటిషన్‌పై విచారణ కొనసాగుతున్న దృష్ట్యా బెయిల్ మంజూరయ్యే అవకాశాలు స్వల్పంగా ఉన్నాయని న్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఇప్పటికే మంచిర్యాల కోర్టు పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కొట్టివేసినప్పటికీ, మరోసారి అప్పీల్ చేయించడం వెనుక రాజకీయ ప్రేరేపణలు ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. బాల్క సుమన్‌ను బయటకు రానివ్వకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లా కోర్టు లంచ్ తర్వాత ప్రకటించబోయే బెయిల్ పిటిషన్ తీర్పుపై రాజకీయ వర్గాలు, ప్రజల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

## మెదక్ జిల్లా సంతలో బంగారు నగల అపహరణ...
### 5 తులాల బంగారం చోరీ బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు...



మెదక్//**మార్చి02(ఆకాంక్ష)** : మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి సంతలో గుర్తు తెలియని దుండగులు దంపతులకు చెందిన బంగారు నగలను అపహరించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో కొల్చారం గ్రామానికి చెందిన శ్రావణి, ప్రవీణ్ దంపతులకు చెందిన సుమారు 5 తులాల బంగారు నగలు దుండగుల చేతికి చిక్కాయి. వీటి విలువ సుమారు రూ.8 లక్షలుగా అంచనా వేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, సంతకు వచ్చిన సమయంలో గుమిగూడిన జనసందోహాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు తెలివిగా నగలను అపహరించినట్లు తెలుస్తోంది. విషయం గుర్తించిన వెంటనే బాధితులు ఆందోళనకు గురై చుట్టుపక్కల వారిని విచారించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో బాధితులు వెంటనే మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రదేశంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనుమానితుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా సంతలు, జాతరలు వంటి రద్దీ ప్రదేశాల్లో బంగారు ఆభరణాలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని పోలీసులు సూచించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## అభివృద్ధి ప్రదాత శ్రీపాదరావుకు ఘన నివాళులు...



గోదావరిఖనిమార్చి02(ఆకాంక్ష) : అభివృద్ధి ప్రదాతగా, అజాత శత్రువుగా గుర్తింపు పొందిన మాజీ సభాపతి శ్రీపాదరావుకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఘన నివాళులు అర్పించారు. సోమవారం శ్రీపాదరావు జయంతి సందర్భంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచి ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించిన శ్రీపాదరావు పనితీరును తెలుగుదేశం పార్టీ స్థాపకుడు, నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు సైతం కొనియాడారని తెలిపారు. సర్పంచ్ స్థాయి నుంచి సభాపతి స్థాయికి ఎదిగి ప్రజలకు ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడు మన జిల్లా వాసి కావడం గర్వకారణమని అన్నారు.శ్రీపాదరావు చేసిన సేవలకు గుర్తింపుగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు "శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు"గా నామకరణం చేయడం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లో అడుగు పెట్టిన మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తూ,పరిశ్రమల స్థాపనకు లక్షల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకువస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు.శ్రీపాదరావును ఆదర్శంగా తీసుకుని రామగుండం నగరంలో అభివృద్ధి పథంలో తమ పాలన కొనసాగుతుందని మేయర్ స్పష్టం చేశారు.కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,నగరపాలక సంస్థ ఎస్.ఇ గురువీర, ఈ.ఈ రామన్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, నగర పాలక సంస్థ సిబ్బంది హాజరయ్యారు. అంతకు ముందు గోదావరిఖని బస్ స్టాండ్ ఎదుట ఉన్న శ్రీపాదరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి ఘనంగా నిర్వహణ...



గోదావరిఖని//మార్చి02(ఆకాంక్ష) : రామగుండం ఏరియా1 ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌జీ1 జీఎం కార్యాలయం సమావేశ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్‌ఓ టు జీఎం శ్రీ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుద్దిళ్ళ శ్రీపాదరావు మంథని వాస్తవ్యులు, ధన్వాడకు చెందినవారని, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా సేవలందించిన కాలంలో సభను క్రమబద్ధంగా నడిపించడంలో విశేష గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సభ్యుల మధ్య న్యాయంగా వ్యవహరిస్తూ స్పీకర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారని, సభా నియమాలు, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి ఆయన చేసిన కృషి విశేషమని తెలిపారు.ప్రజల మనిషిగా శాంత స్వభావంతో, నిష్పక్షపాత ధోరణితో నిర్ణయాలు తీసుకుంటూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన నాయకుడిగా శ్రీపాదరావు నిలిచారని, ఆయన స్పీకర్‌గా చేసిన సేవలు ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయన చేసిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ ఈ.రాజు, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రావణ్ కుమార్, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీ భాయి, సీనియర్ పీవో హన్మంతరావు, జీఎం ఆఫీస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ కోయ హర్ష సమీక్ష...



గోదావరిఖని/మార్చి02(ఆకాంక్ష) : 2027లో జరగనున్న గోదావరి మహా పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై ప్రణాళికాబద్ధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం గోదావరిఖనిలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాతో కలిసి జిల్లా స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరగనున్నాయని, ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్‌ల నిర్మాణం, రహదారుల విస్తరణ, వీధి దీపాల ఏర్పాటు, పార్కింగ్ స్థలాల అభివృద్ధి, తాత్కాలిక వసతి సదుపాయాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.జిల్లాలోని గోలివాడ, మంథని, గోదావరిఖని, సుందిళ్ల ప్రాంతాల్లో గోదావరి ప్రవాహం ఉన్న నేపథ్యంలో అక్కడ ప్రత్యేక ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సురక్షిత ఘాట్‌లు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య చర్యలు, రక్షణ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.ఇంజనీరింగ్ శాఖల అధికారులు అవసరమైన పనుల అంచనాలు సిద్ధం చేసి తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని, ప్రభుత్వ ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాల సందర్భంగా జిల్లా ప్రతిష్ట పెరిగేలా శుభ్రత, సౌకర్యాలు, భద్రత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అన్నారు.సమావేశంలో డీసీపీ రామ్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర రాజకీయాల్లో చిరస్మరణీయుడు అజాత శత్రువు దుద్దిళ్ల శ్రీపాదరావు..

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





గోదావరిఖని//మార్చి02(ఆకాంక్ష) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను పెద్దపల్లి జిల్లాలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథని నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీపాదరావు అనంతరం శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రజా సేవలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించారని తెలిపారు. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన ఆయన సర్పంచ్‌గా, సమితి ఉపాధ్యక్షుడిగా, ఎల్ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా వివిధ పదవుల్లో సేవలందించి ప్రజలకు దగ్గరయ్యారని కొనియాడారు.1983 సంవత్సరం నుంచి వరుసగా మూడుసార్లు మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన, 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారం సమీపంలో నక్సలైట్ల చేతిలో హత్యకు గురైన విషాద సంఘటనను కమిషనర్ స్మరించుకున్నారు. గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి శాసనసభ్యుడిగా, అనంతరం స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి ఆ పదవికి వన్నె తెచ్చిన నాయకుడిగా శ్రీపాదరావు నిలిచారని పేర్కొన్నారు.రాష్ట్రానికి ఎనలేని సేవలందించిన మహనీయుడిగా, రాజకీయాల్లో అజాత శత్రువుగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, సీసీ హరీష్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల వేదికగా

## బాజ సాఏఇండియా2026 పోటీలు....




మెదక్/మార్చి02(ఆకాంక్ష) : మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరుగుతున్న బాజసా ఏఇండియా 2026 పోటీలు ఐదవ రోజుకు చేరుకుని విద్యార్థులకు ఉపాధి అవకాశాల వేదికగా నిలుస్తున్నాయి. సాంకేతిక ప్రతిభను ప్రదర్శించేందుకు నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా సోమవారం హెచ్ఆర్ మీట్ నిర్వహించారు.ఈ హెచ్ఆర్ మీట్‌లో ప్రముఖ సంస్థలు జేకే టైర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్ , టీవీఎస్ మోటార్స్ కంపెనీ , వర్రోక్ ఇంజనీరింగ్ లిమిటెడ్ పాల్గొని విద్యార్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను అంచనా వేయడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పరీక్షించాయి.బీటెక్ (బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ) అర్హతను ఆధారంగా తీసుకుని విద్యార్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు పోటీల జాయింట్ కన్వీనర్ డా. మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు.పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఈ హెచ్ఆర్ మీట్ ద్వారా ప్రముఖ కంపెనీలతో నేరుగా పరిచయం ఏర్పరుచుకుని తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోటీలు విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూ ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయని కళాశాల వర్గాలు వెల్లడించాయి.

## కొమురవెల్లి మండలంలో వడదెబ్బతో మహిళ మృతి....

కొమురవెల్లి/మార్చి02(ఆకాంక్ష) : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపస్‌పల్లి గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంకణాల పద్మ (పేరు) హఠాత్తుగా మృతి చెందడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు.గ్రామస్తుల వివరాల ప్రకారం, కంకణాల పద్మ ఆదివారం ఉపాధి హామీ పనులకు వెళ్లి మధ్యాహ్నం వరకు పనిలో పాల్గొన్నారు. అనంతరం తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఈ ఘటనతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే సిద్దిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు.మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, భర్త కంకణాల సిద్దులు ఉన్నారు. పద్మ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు ఆపడం ఎవరి వశం కాలేదు. గ్రామమంతా విషాదంలో మునిగి పోయింది. మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంలో ఆలస్యం కావడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, సన్నిహితులు భారీగా హాజరై పద్మకు తుది వీడ్కోలు పలికారు.ఈ ఘటనతో తపస్‌పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

### తహసీల్దార్ ను మర్యాదపూర్వకంగా

## కలిసిన 29వ డివిజన్ కార్పొరేటర్...



గోదావరిఖని టౌన్//మార్చి02(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని టౌన్‌లో 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి సోమవారం అంతర్గాం తహసీల్దార్ తూమ్ రవీందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఇటీవల రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మొదటిసారి ఎమ్మార్వోను కలిసినట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా లింగాపూర్ గ్రామానికి సంబంధించిన భూమి సమస్యలు, ప్రజలకు ఎదురవుతున్న ఇతర సమస్యల పరిష్కారం కోసం తాసిల్దార్ సహకారం అందించాలని కోరినట్లు నిమ్మరాజుల రజిని రవి పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పల్లికొండ తిరుపతి, పిట్టల రాములు, గుర్రం రాజలింగు, అరకూటి నంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## వంట పాత్రల సరఫరాకు టెండర్ల ఆహ్వానం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలో నిర్వహించబడుతున్న ప్రభుత్వ బీసీ ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ వసతి గృహాలకు అవసరమైన వంటపాత్రలు మరియు ఇతర సామాగ్రి సరఫరా కోసం టెండర్లను ఆహ్వానించినట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 వసతి గృహాలకు అవసరమైన 28 రకాల వంటపాత్రలు సరఫరా చేయుటకు ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్ కలిగిన ఆసక్తి గల వ్యాపారస్తుల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.టెండర్ దరఖాస్తుదారులు రూ.20,000 మొత్తాన్ని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, నాగర్ కర్నూల్ పేరుమీద డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుందని తెలిపారు. టెండర్ షెడ్యూల్ ఫారములు మార్చి 4 నుండి మార్చి 9 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.పూర్తి చేసిన టెండర్ దరఖాస్తులను మార్చి 10 సాయంత్రం 4 గంటలలోగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీల్డ్ బాక్స్‌లో సమర్పించాలని, గడువు అనంతరం అందిన టెండర్లను పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. సమర్పించిన టెండర్లను మార్చి 13 మధ్యాహ్నం 3 గంటలకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ సమక్షంలో తెరవబడతాయని వివరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నాగర్ కర్నూల్‌కు టెండర్ ప్రక్రియను వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు పూర్తి అధికారముందని, జిల్లా కొనుగోలు కమిటీ ఆదేశాల మేరకు టెండర్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదగిరి తెలిపారు.

## మాల సంఘం ఆధ్వర్యంలో గెలిచిన కార్పొరేటర్లకు ఘన సన్మానం...

### ఐక్యతతో ముందుకు సాగుదాం అన్న పిలుపు...



గోదావరిఖని టౌన్//మార్చి02(ఆకాంక్ష) : రామగుండం కార్పొరేషన్‌లో మాల సంఘానికి చెందిన కార్పొరేటర్లుగా గెలుపొందిన ప్రజాప్రతినిధులకు మాల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గోదావరిఖని పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు, సభ్యులు, టీమ్ సభ్యులు, జనవిజ్ఞాన పరిషత్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని గెలుపొందిన కార్పొరేటర్లను పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మాల కార్పొరేటర్లుగా గెలిచిన నెలకంటి రాము, మార్కపురి సూర్య, దొంతు శ్రీనివాస్, మెరుగు భూలక్ష్మిలను ఘనంగా అభినందించారు. అంతే కాకుండా ఎన్టీపీసీ, హనుమాన్ నగర్, గంగా నగర్ ప్రాంతాలకు చెందిన మాల కుల బంధువులు, ఆత్మీయులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్పొరేటర్లను శుభాకాంక్షలతో ముంచెత్తారు.సన్మాన కార్యక్రమం అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ మాల సంఘం బలోపేతానికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.రామగుండం కార్పొరేషన్ పరిధిలో మాలల ఐక్యతను చాటుతూ, సమాజ అభ్యున్నతికి కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.



సంఘం బలపడాలంటే ప్రతి సభ్యుడు బాధ్యత తీసుకోవాలని, ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా ముందుకు వచ్చి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మాల సంఘం సభ్యులు ఎన్నికల సమయంలోనే కాకుండా ఎల్లప్పుడూ తమ అభ్యర్థులకు అండగా నిలవాలని, రాబోయే ఎన్నికల్లో మాల కులస్తులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి విజయం సాధించే దిశగా కృషి చేయాలని కార్పొరేటర్లు కోరారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో మాల సంఘం కోసం ప్రత్యేక భవనం నిర్మాణానికి కూడా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.మాల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మాలేం మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు సోగాల వెంకటి, జనరల్ సెక్రటరీ మర్రి ఐలయ్య, నంది నరేష్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో మాల సంఘం అధికార ప్రతినిధి కడమండ శ్రీహరి, టీమ్ అధ్యక్షులు బద్దం డానియల్, ఉపాధ్యక్షులు అందుగుల లింగయ్య, రఘు బాబు, దాసరి రాజు, జనవిజ్ఞాన పరిషత్ అధ్యక్షులు ఎరుకల లక్ష్మణ్ రావు, ఉపాధ్యక్షులు జూపాక పోషం, సీనియర్ జర్నలిస్ట్ మాదాసు రామ్మూర్తి, సలహా దారులు పిట్టల వెంకటి, దాసరి రామస్వామి, నంది నగేష్, నూకల మొండి, పొన్నగంటి రాజయ్య, జక్కుల నారాయణ, అందుగుల రాజేశం, దాసరి రమేష్, బొమ్మక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాలెం గ్రామంలో ఇంటింటా ఆరోగ్య పరీక్షలు...

### మెడికల్ విద్యార్థుల సేవా కార్యక్రమం ప్రశంసనీయం...

నాగర్ కర్నూల్ టౌన్//మార్చి02(ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలో ఉన్న పాలెం గ్రామంలో మెడికల్ విద్యార్థులు నిర్వహిస్తున్న ఇంటింటా ఆరోగ్య పరీక్షల కార్యక్రమం విశేషంగా నిలుస్తోంది. ఉయ్యాలవాడలో మొదటి సంవత్సరం చదువుతున్న మెడికల్ కళాశాల విద్యార్థులు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యంపై సమగ్ర అవగాహన పెంచడం లక్ష్యంగా విద్యార్థులు కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్లి పెద్దలు, మహిళలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. రక్తపోటు, షుగర్ స్థాయిలను పరీక్షిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నారు. థైరాయిడ్ సమస్యలపై కూడా పరీక్షలు నిర్వహిస్తూ ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల లక్షణాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందిస్తున్నారు.జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి వెంటనే వైద్య సలహాలు ఇస్తున్నారు. ప్రతి కుటుంబం తీసుకుంటున్న పౌష్టికాహారం గురించి వివరాలు సేకరించి సమతుల ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. పిల్లల పెరుగుదల, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, వృద్ధుల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండటంతో సులభమైన భాషలో ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు. శుభ్రత పాటించడం, శుద్ధమైన తాగునీరు వినియోగించడం ఎంత అవసరమో ప్రజలకు తెలియజేశారు. దోమల నివారణ కోసం గ్రామంలో గుంతలు, చెత్త నిల్వలను తొలగించాలని సూచించారు. రోజువారీ వ్యాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ధూమపానం, మద్యం వంటి అలవాట్ల దుష్ప్రభావాలపై ప్రజలను హెచ్చరించారు. పిల్లలకు సమయానికి టీకాలు వేయించుకోవాలని తల్లిదండ్రులకు సూచనలు అందించారు. విద్యార్థులు ప్రతి ఇంటి ఆరోగ్య రికార్డులను నమోదు చేస్తూ గ్రామానికి ఒక సమగ్ర ఆరోగ్య నివేదిక తయారు చేస్తున్నారు. గ్రామం మొత్తం పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రత్యేక ఆరోగ్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.ఆ శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు ప్రత్యక్ష మార్గదర్శనం చేయనున్నారు. గ్రామస్తులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ విద్యార్థుల సేవాభావాన్ని కొనియాడుతున్నారు. ఇంటివద్దకే వచ్చి పరీక్షలు చేయడం వల్ల తమకు ఎంతో సౌలభ్యం కలిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి గ్రామ ప్రజల మనసులు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంచడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వ ప్లాట్ల ఆక్రమణలపై

## చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి...




జడ్చర్ల// మార్చి02(ఆకాంక్ష) : మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్లాట్లు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్లాట్ల లబ్ధిదారులు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబర్ 36/2లో ఉన్న 3 ఎకరాలు 22 గుంటల ప్రభుత్వ భూమిని 1997 సంవత్సరంలో గ్రామంలోని 58 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ భూమి అసలు జక్కా భూచయ్య (నాగయ్య కుమారుడు) వారు 1966 సంవత్సరంలో గుంటుక సైదా రెడ్డి నుంచి ఐదు ఎకరాలు కొనుగోలు చేసినదని, ఆ ఐదు ఎకరాలలో నుంచి 3 ఎకరాలు 22 గుంటలను పేదలకు ఇళ్ల స్థలాల కోసం 1997లో స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చినట్లు వివరించారు. అయితే ఆ భూమి రికార్డుల్లో గుంటుక సైదా రెడ్డి పేరు తొలగించకపోవడంతో ఆయన వారసులు విరసత్ చేసుకుని ప్రస్తుతం ప్లాట్లు పొందిన లబ్ధిదారులకు కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.దీంతో ప్రభుత్వమే పంపిణీ చేసిన ప్లాట్లపై తాము హక్కులు కలిగి ఉన్నప్పటికీ, రికార్డులలో మార్పులు జరగకపోవడం వల్ల న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు తెలిపారు. అందువల్ల సంబంధిత అధికారులను ఆదేశించి రికార్డులను సరిచేసి, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం...



ఓదెల//మార్చి02(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) వేన్నెపు అనిల్ రెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.మార్చి 4, 2026 నుండి ఐదు రోజుల పాటు మండల ప్రజా పరిషత్ కార్యాలయం మరియు ఐకేపీ మీటింగ్ హాల్‌లో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. గ్రామ పంచాయతీలలో అమలు చేయాల్సిన విధానాలు, నియమ నిబంధనలు, పరిపాలనా విధివిధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు పద్ధతులు, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై టీఓటీ బృందం ద్వారా సమగ్ర శిక్షణ అందించనున్నారు.గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల హాజరు వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాల్సి ఉన్నందున, సంబంధిత వార్డు సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ వేన్నెపు అనిల్ రెడ్డి సూచించారు. ఈ శిక్షణ ద్వారా గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపడటంతో పాటు గ్రామీణ అభివృద్ధికి మరింత బలోపేతం చేకూరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు...



మంథని//మార్చి02(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో స్వర్గీయ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి నేతకు ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో పట్టణంలో సేవా కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు సహాయం అందించారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ చేయడంతో పాటు శానిటేషన్ సిబ్బందికి చీరలు అందజేశారు. అనంతరం మంథని బస్టాండ్‌లో మంథని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాధుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజల నుండి మంచి స్పందన లభించింది.ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ, స్వర్గీయ శ్రీపాదరావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుండటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, పెంటరి రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.